

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## మాజీ ఉపరాష్ట్రపతిని కలిసిన జిల్లా కలెక్టర్ శుక్ల



**వెంకటాచలం, అక్టోబరు 7, ప్రభాతవార్త :** మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, నెల్లూరులోని వెంకటాచలంలోని స్వర్ణ భారతి ట్రస్ట్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల కలిసారు. పలు అంశములపై మాజీ ఉపరాష్ట్రపతి, జిల్లా కలెక్టర్ చర్చించారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, అక్టోబరు 7, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం సాయంత్రానికి 14296 క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 73.652 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్‌ఎఫ్‌సికి 0, ఎన్‌ఎఫ్‌సికి 100, పెన్నా డెల్టాకు 0, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.988 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## కలెక్టర్‌ని కలిసిన అజయ్ కుమార్



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 7, ప్రభాతవార్త** ఏపి టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ హిమాన్షు శుక్లని మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పూల బొక్కే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

## పార్టీ ఫిరాయింపుల చట్టానికి సవరణలు అవసరం

**- ఉచిత పథకాలు అభివృద్ధి నిరోధకాలు - న్యాయ వ్యవస్థ పై దాడి అమానుషం - మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు**

**వెంకటాచలం, అక్టోబరు 7, ప్రభాతవార్త :** సుప్రీం కోర్టు సీ జే ఐ పై జరిగిన దాడిని న్యాయ వ్యవస్థపై జరిగిన దాడిగా తాను భావిస్తున్నట్లు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. వెంకటాచలం స్వర్ణభారతి ట్రస్ట్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. న్యాయమూర్తి పై జరిగిన దాడి శోచనీయమని దాన్ని తాను గర్హిస్తున్నట్లు ఆయన చెప్పారు.ఇది ఎంత మాత్రం సమర్థనీయం కాదని ఆయన అన్నారు. దేశంలో పార్టీ ఫిరాయింపులు పెరిగాయని ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు చేటు అని వెంకయ్య నాయుడు అన్నారు. ఈ సమస్య ఈనాటిది కాదని దాదాపు అన్ని రాష్ట్రాల్లో ఉందని ఆయన అన్నారు. పార్టీ ఫిరాయించిన వారు తాము గెలిచిన పార్టీకి పదవికి రాజీనామా చేయాలన్నారు. లేదంటే వారిని పదవికి అనర్హులుగా ప్రకటించేలా 10 వ షెడ్యూల్ ను సవరించాలని ఆయన సూచించారు. లేదంటే ప్రభుత్వాలు కూలిపోయి రాష్ట్రాల్లో అస్థిరత నెలకొంటుందని తద్వారా ఆర్థిక భారం కూడా పెరుగుతుందని నాయుడు చెప్పారు. ఇది దేశ రాజకీయాల్లో ఆందోళన కలిగించే విషయమని ఆయన అభిప్రాయపడ్డారు. ఉచిత పథకాలు అభివృద్ధి నిరోధకాలని ఆయన అన్నారు. రాజకీయ పార్టీలు తమ ఉనికి కోసం పోటీపడి ఉచిత పథకాలను ప్రకటించడమే కాకుండా అమలు చేస్తున్నాయని వెంకయ్య నాయుడు అన్నారు. ఈ విధానం వల్ల మేలు ప్రజలకు మేలు



జరగకపోగా కీడు జరిగే అవకాశాలు ఎక్కువ ఉన్నాయన్నారు. ఉచిత పథకాలను అమలు చేసే వారు తాము ఆ పథకాలకు నిధులను ఏ రూపంలో సేకరిస్తారో, లేదంటే రుణాలు తెచ్చిన తర్వాత వాటిని ఏ విధంగా తీరుస్తారో అనే విషయమై అసెంబ్లీలో ఆఫిడవిట్ ఇవ్వాలన్నారు. ప్రజలకు కడుభారమైన విద్య వైద్యం ఉచితంగా అందించగలిగినప్పుడే సమాజంలో అసమానతలు రూపు మాపవచ్చన్నారు. రుణాలు తెచ్చే ప్రభుత్వ అధినేతలు నీటి ప్రాజెక్టులు వంటి శాశ్వత పథకాలకు కేటాయిస్తే పేదరిక నిర్మూలన కూడా జరుగుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు సప్త సభల్లో మాట్లాడే భాష దారుణంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు హద్దులు దాటి రాజకీయాలతో సంబంధం లేని కుటుంబ సభ్యులను కూడా విమర్శించడం అనైతికమన్నారు. అటువంటివారిని రాజకీయాల్లో అనర్హులుగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయారాజకీయపార్టీలు తమ ఎమ్మెల్యేలకు నైతిక విలువలపై, మాట్లాడే భాష పై శిక్షణా తరగతులు నిర్వహించాలని వెంకయ్య నాయుడు సూచించారు. లేదంటే ప్రపంచంలోనే అతి పెద్దదైన మన ప్రజాస్వామ్యం అపహాస్యం పాలు అవుతుందని వెంకయ్య అన్నారు. కోర్టులు కేసుల విషయంలో వాయిదాలు ఎక్కువగా వేసి తీర్పులు జాప్యం జరిగే విధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కేసుల విచారణలో జాయిన్ జరగకుండా ఉండాలంటే మరిన్ని అదనపు కోర్టులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనాఉందని వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు.

## అందరికీ న్యాయం జరిగే విదంగా చర్యలు కలెక్టర్ శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 7, ప్రభాత వార్త** మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ హిమ వంశీతో కలిసి కరేడ్ వద్ద నిర్మితమవుతున్న ఇండోసోల్ పరిశ్రమకు సంబంధించి భూములు ఇచ్చిన రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పరపాలెం, రామకృష్ణాపురం, ఉలవపాడు, చేవూరు,రావూరు,కరేడు పలువురు రైతులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని అవసరమైతే పై అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి అందరికీ న్యాయం జరిగే విదంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా స్థాయి నేగోసియేషన్ కమిటీ ద్వారా భూములు ఇచ్చిన రైతులకు ఎంత మేర నగదు చెల్లించవలసిందో చర్చించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఐఐసి, జెఎం రాజశేఖర్, జిఎం శివకుమార్, పలువురు రైతులు పాల్గొన్నారు.

## విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి

**- గుంటూరు రేంజి ఐజి సర్వ శ్రేష్ట త్రిపాఠి - పోలీస్ అధికారులతో ఐజి సమీక్ష సమావేశం**



**నెల్లూరు క్రైమ్, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తూ, విలేజ్ విజిట్ చేసి ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకొని పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాఠి జిల్లా పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల, ఇతర పోలీసు అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుత పరిస్థితులు, తీసుకోవాల్సిన చర్యలను ఆరా తీసి, పలు సూచనలు చేశారు. ప్రాపర్టీ, రౌడీ ఎలిమెంట్స్, గాంజా, మిస్సింగ్ కేసులు, పోక్సో, మహిళలపై జరిగే నేరాల నివారణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, బేసిక్ పోలీసింగ్ అమలు చేయాలని ఆదేశించారు. రాత్రి, పగలు డ్రోన్ పెట్రోలింగ్ ముమ్మరంగా చేయాలని, ప్రతి గ్రామంలో సిసి కెమెరాల ప్రాముఖ్యత వివరించి, ఏర్పాటు చేసుకొనేలా ప్రోత్సహించి, ఏర్పాటు చేయించాలన్నారు. గాంబ్లింగ్ ఆడేవారితో పాటు, నిర్వాహకులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సోషల్ మీడియా వేదికలలో ఇష్టానుసారం పోస్టులు పెట్టే వారిపై పోలీస్ శాఖ నిరంతర నిఘా ఏర్పాటు చేశామని, అటువంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రమాదాలు ఎక్కువగా జరిగే సమయం, ప్రాంతాలను విశ్లేషించి, ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా అధికారులకు అమూల్యమైన సలహాలు, సూచనలు అందించిన ఐజికి జిల్లా ఎస్పీ అజిత ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సిహెచ్. సౌజన్య, పలువురు డిఎస్పిలు పాల్గొన్నారు.

## రామాయణ మహా కావ్యాన్ని ప్రపంచానికి అందించిన మహర్షి వాల్మీకి

**- జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు - ఘనంగా కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతి వేడుకలు**





**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** భారతీయ సంస్కృతి, నీతి, ధర్మం, సత్యం, కరుణ వంటి విలువలతో కూడిన అత్యద్భుతమైన రామాయణ మహా కావ్యాన్ని ప్రపంచానికి అందించిన మహర్షి వాల్మీకి అని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో సర్వమానవాళికి మార్గదర్శకుడైన ఆదికవి వాల్మీకి మహర్షి జయంతిని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత అధికారులు, బిసి సంఘాల నాయకులు జ్యోతిప్రజ్వలన చేసి, వాల్మీకి మహర్షి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ వాల్మీకి జీవిత విశేషాలను క్లుప్తంగా వివరించారు. అనంతరం జేసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మానవుని జీవన విధానానికి, ధర్మపాలనకు నిలువెత్తు సాక్షాత్కారం రామాయణమని, 23 వేల శ్లోకాలతో, ఏడు ఖండాలతో రామాయణ పవిత్ర మహాకావ్యాన్ని మనకు అందించిన గొప్ప మహర్షి వాల్మీకి అని కొనియాడారు. వాల్మీకి మహర్షి జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని, సాధారణ మనిషి నుంచి ఒక మహా ఋషిగా ఎదిగి, మనుషులు మహా ఋషులవుతారని నిరూపించిన వాల్మీకి జీవిత చరిత్ర ఒక ఉదాహరణ అని ఆయన అన్నారు. పలు బీసీ సంఘాల నాయకుల విజ్ఞప్తి మేరకు నగరంలో బీసీ భవన్ పూర్తి చేసేందుకు కృషి చేస్తామని, ఈ సమస్య పరిష్కారపై సీఎం సానుకూలంగా ఉన్నారని చెప్పారు. అలాగే నగరంలో వాల్మీకి మహర్షి విగ్రహం, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు మొదలైన బీసీ సంఘాల నేతలు సూచించిన పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు బీసీ సంఘం నాయకులు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి కేవలం కవి మాత్రమే కాదు, సమాజ పునర్నిర్మాణకారుడు, ఆదర్శమూర్తి అని పేర్కొన్నారు. ఆయన చూపించిన సత్యధర్మ మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. నెల్లూరు నగరంలో వాల్మీకి విగ్రహం, వాల్మీకి భవనం ఏర్పాటు చేయాలని, బీసీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని విన్నవిస్తూ జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో విజయ్ కుమార్, బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, సెట్నల్ సీఈవో నాగేశ్వరరావు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, బీసీ సంక్షేమ సంఘ నాయకులు నల్లబోతుల వెంకటేశ్వర్లు, దేవరాల సుబ్రహ్మణ్యం, బిసి కోటయ్య, జనార్ధన్, కాలేషా, బుధవారపు బాలాజీ, పిఎల్ రావు, మురళీకృష్ణ, వసతి గృహ సంక్షేమ అధికారులు, పలు బీసీ సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మూడేళ్ల తర్వాత ఎస్టీ సర్టిఫికేట్లు.. లబ్దిదారుల్లో ఆనందం



**నెల్లూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త-వైద్యం** పొదలకూరులో అనేక ఏళ్లుగా ఎస్టీ కుటుంబాలు నివాసం ఉంటున్నారు. వైసీపీ హయాంలో కుల ధృవీకరణ పత్రాల జారీని నిలిపివేసిన అధికారులు. అప్పటి ప్రజాప్రతినిధులను కలిసినా బాధితులకు జరగని న్యాయం. జిల్లాలోని అన్ని మండలాల్లో ఎస్టీ సర్టిఫికేట్లు జారీ చేస్తున్నా.. పొదలకూరులో మాత్రం నిలిపివేత. కూటమి ప్రభుత్వం రాగానే ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి సమస్యను తెచ్చిన ఎస్టీలు. జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లిన సోమిరెడ్డి. విచారణ అనంతరం అర్హులందరికి ఎస్టీ సర్టిఫికేట్ల జారీకి చర్యలు చేపట్టిన అధికారులు. మొదటి విడతలో 100 మందికి పైగా జారీ అయిన సర్టిఫికేట్లను సోమిరెడ్డి చేతుల మీదగా అందుకున్న ఎస్టీలు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి తమకు సర్టిఫికేట్లు జారీ కాకుండా అడ్డుకున్నారని, తమ గోడును ఆలకించి సర్టిఫికేట్లు జారీ అయ్యేలా చర్యలు తీసుకున్న సోమిరెడ్డికి ధన్యవాదాలు తెలియజేసిన పొదలకూరు వాసులు.

## ఉపాధి హామీ అవినీతి డ్రామా పై పునర్విచారణ

**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 7, ప్రభాతవార్త** మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన అవినీతి పై చిన్న గోపవరం పంచాయతీ నందు చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ విచారణ చేపట్టి ఎనిమిది మందిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశిస్తే నెల్లూరు జిల్లా డ్వామా అధికారులు ఇద్దరు ఏపీఓలను తప్పించి కలువాయి పోలీస్ స్టేషన్ నందు ఆరుగురి ఉపాధి సిబ్బందిపై మాత్రమే క్రిమినల్ కేసు నమోదు చేసి మిగతా ఇద్దరిని తప్పించడం వెనుక డ్వామ అధికారులు చేతివాటం ప్రదర్శించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. డ్వామాని కలువాయి మండలం రామన్నగారిపల్లికి చెందిన ఒక వ్యక్తి రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖ లో చక్రం తిప్పుతూ రాష్ట్రస్థాయి అధికారులను తప్పుదోవ పట్టిస్తూ ఉన్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇద్దరు ఏపీఓల దగ్గర భారీ ముడుపులు తీసుకుని డ్వామా అధికారులు రాష్ట్రస్థాయి విజిలెన్స్ అధికారులు ఆదేశాలు బేఖాతాలు చేశారని తెలుస్తుంది. ఈ విషయంపై మాజీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కొప్పాల రఘు నేషనల్ ఎస్సీ




కమిషన్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కలువాయి మండలంలో 20 పంచాయితీలలో జరిగిన ఉపాధి అవినీతి వ్యవహారంపై పునః విచారణ చేయవలసిందిగా నేషనల్ ఎస్సీ కమిషన్ ఆదేశాల అనుసారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల జిల్లా ఎస్ పి, డ్వామా, జిల్లా పంచాయతీ అధికారులకు పునః విచారణ చేసి ఎస్సీ జాబ్ కార్డుల వ్యవహారంలో అగ్రకులాల పేర్లు చేర్చిన వారి జాబితాలో సహకరించినటువంటి అధికారుల వ్యవహారం, సింగిల్ జాబ్ కార్డులు, అవినీతికి పాల్పడిన నగదు విషయంపై క్షుణ్ణంగా విచారణ చేయనున్నట్లు తెలుస్తుంది. ఉపాధి హామీ చరిత్రలో రాష్ట్రంలో తొలిసారిగా కలువాయి ఉపాధి సిబ్బందిపై క్రిమినల్ కేసు నమోదు చేసిన విషయం అందరికీ తెలిసినదే. అయినప్పటికీ ఉపాధి హామీ పథకంలో రాష్ట్ర విజిలెన్స్ అధికారుల ఆదేశాలను పక్కన పెట్టి డ్వామా అధికారుల వ్యవహార శైలిపై ఆధారాలతో నేషనల్ ఎస్సీ కమిషన్ కు మాజీ విజిలెన్స్ కమిటీ మెంబర్ రఘు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ విచారణ చేయాలనీ ఆదేశాలు ఇవ్వడంతో నిజాలు బయటకి వస్తాయని డ్వామా అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని చెప్పవచ్చు.

**నెల్లూరు జిల్లా డ్వామా పీడీ గంగాభవాని వివరణ**

కలువాయి మండలంలో జరిగిన వ్యవహారంపై పునః విచారణ చేయమని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసి ఉన్నారు. జిల్లా ఎస్పీ, డీపీవోతో డ్వామా కలసి త్వరలో విచారణ చేసి రిపోర్టు కలెక్టర్‌కు అందిస్తాం.

## రాపూరులో లోపిస్తున్న పారిశుద్యం ఇబ్బందులలో ప్రజలు



**రాపూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరులో పారిశుధ్యం లోపిస్తున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయితీలో వున్న చెత్తలను రెండు రోజులకు ఒకసారి తోలగిస్తున్నప్పటికి అవగాహనా లోపంతో పలువురు చెత్తను ఎక్కడబడితే అక్కడ పోయడంతో రోడ్డుపై చెత్త పేరుకోని పోయి పందులకు, కుక్కలకు అవాస కేంద్రాలుగా మారుతున్నాయి. ఇప్పటికైనా పంచాయితీ అధికారులు పారిశుద్యంపై పంచాయితీలో ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, ప్రతి నిత్యం వీదులలో చెత్త కుప్పలను తోలగించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా మలేరియా అధికారి డా.హుస్సేనమ్మ



**పొదలకూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త** మొహమదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆశాడే సందర్భంగా జిల్లా మలేరియా అధికారి డాక్టర్ హుస్సేనమ్మ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజన్‌లో వచ్చే వ్యాధుల గురించి వర్షాలు తక్కువగా ఉండటం వలన డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా, టైఫాయిడ్ మరియు సీజన్‌లో వచ్చే వైరల్ ఫీవర్ గురించి కీటక జనిత స్క్రబ్ టైపస్ గురించి ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేయడం జరిగినది. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో అబేట్ పిచికారి చేయించడం, దోమతెరలు వాడడం క్లోరినేషన్ చేసిన, కాశీ చల్లార్చిన తాగునీటిని మాత్రమే వాడాలి. పరిసరాల పరిశుభ్రత గురించి, వ్యక్తిగత పరిశుభ్రత గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ఆంజనేయ వర్మ, పబ్లిక్ హెల్త్ నర్స్ వరలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు మస్తాన్ బి, నరసమ్మ ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ సీతారాముల స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



**కావలి, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం, చౌదరిపాలెం గ్రామంలోని శ్రీ కోదండ రామస్వామి దేవాలయం లోని శ్రీ సీతారాములను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి దర్శించుకోవడం జరిగింది. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు దుశ్శాలవాలతో పూలమాలలతో ఘనంగా సత్కరించి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే దగుమాటి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించడం జరిగింది.కావలి నియోజకవర్గ ప్రజలు అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో ప్రశాంతంగా ఉండాలని శ్రీ సీతారాములస్వామూలవారిని కోరుకోవడం జరిగింది.

## మహర్షి వాల్మీకికి ఘన నివాళులు



**కోవూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** రామాయణ సృష్టికర్త మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహర్షి చిత్రపటానికి కార్యాలయ పర్యవేక్షకులు ఉషారాణి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సురేష్, జూనియర్ అసిస్టెంట్ రాధ, పంచాయతీ రాజ్ ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

## బాల్య మిత్రునికి స్నేహ పూర్వక చేయూత



**కావలి, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** జాగో సేవా సంస్థ అధ్యక్షులు షేక్.జమీర్ ఆధ్వర్యంలో తన బాల్యమిత్రుడు దర్జీ వృత్తిని జీవనోపాధిగా జీవనం సాగిస్తున్న ఎస్.శివ కిడ్నీ వ్యాధితో బాధ పడుతూ ఇంటికి పరిమితమై ఎన్నో కష్టాలు పడుతున్న నేపథ్యంలో మంగళవారం వారిగృహమునకు వెళ్లి పరామర్శించి కుటుంబమునకు, బియ్యం, నిత్యవసరవస్తువులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు ఎస్.కె.బాష మాట్లాడారు ప్రార్థించే పెదవులు కన్న సహాయం చేసే చేతులు మిన్న అనే నినాదము తో జమీర్ టైలరింగ్ చేస్తూ తద్వారా వచ్చే కొద్దిపాటి ఆదాయముతో కుటుంబమును పోషించుకుంటూ బాల్యమిత్రుడు అనారోగ్యంతో ఎంతో క్లిష్టపరిస్థితి లో ఉన్నందున వారికి ధైర్యమును నింపి, సహాయ,సహకారాలు అందించాలి అనే మంచి ఆలోచన దృక్పథం నకు మా స్వచ్ఛంద సంస్థల హృదయ పూర్వక అభినందనలు తెలియజేశారు.అనారోగ్యంతో ఆపదలో ఉన్నవారికి,ఆదుకోవడం చాలా సంతోషమైనవిషయమని తెలిపారు.పై కార్యక్రమంలో రత్నమ్మ ఫౌండేషన్ ఎంపీ ఎన్.ప్రసాద్ రావు,టైంటు హెల్ప్ ఎన్.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ సభకు పలు స్థలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



**కావలి, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** ఉమ్మడి కర్నూలు జిల్లాలో 16వ తేదిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటించనున్న నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి,శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర తో కలిసి బహిరంగ సభకు అవసరమయ్యే పలు స్థలాలను మంగళవారం కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పరిశీలించడం జరిగింది.

## వాల్మీకి మహర్షి ఆదర్శాలను అనుసరిద్దాం



**కావలి, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** మహర్షి వాల్మీకి ఆదర్శాలను మన జీవితాల్లో అనుసరిద్దామని కావలి మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ డి. వి నాగేశ్వరరావు తెలియజేశారు.కావలి,వెంగళరావు నగర్ ప్రభుత్వ శాఖా గ్రంథాలయ ఆవరణలో గ్రంథాలయాధికారి బొమ్మల కోటేశ్వర ఆధ్వర్యంలో మంగళవారం వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటైజేషన్ ఇన్స్పెక్టర్ డి.వి.నాగేశ్వరరావు మరియు సచివాలయం సిబ్బంది సచివాలయ ఉద్యోగులు, రమణ కుమ్మర పాల్గొని వాల్మీకి చిత్ర పటానికి పూలతో నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగాసెంట్రల్ ఇన్స్పెక్టర్ నాగేశ్వ రరావు మాట్లాడారు ఆదికవి మహర్షి వాల్మీకి రామాయణాన్ని రచించి, ధర్మం మార్గాన్ని చూపారన్నారు. గ్రంథాలయాధికారి బొమ్మల కోటేశ్వర మాట్లాడారుబోయవాసిగా జన్మించి మహర్షిగా పరివర్తన చెందిన రత్నాకరుడు లోకంలో రామాయణం ఆధారంగా ధర్మ పాపన గావించి శ్రీ రాముని లోకాంత పురుషునిగా చిత్రించిన మహర్షి వాల్మీకి అని, వాల్మీకి సందేశాలను మన దైనందిన జీవితంలో ఆచరణలో పెట్టాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సచివాలయ శానిటైజేషన్ సెక్రటరీలు బి.శివ, కె.బాబు సచివాలయ ఉద్యోగులు ఎన్. సురేష్, వి. సుధీర్, డి .అరుణ్ కుమార్ స్థానిక ప్రజలు మరియు పాఠకులు పాల్గొన్నారు.

## సూపర్ జి.ఎస్.టి,సూపర్ సేవింగ్స్ దేశవాళీ కార్యక్రమం



**కావలి, అక్టోబర్ 7, ప్రభాతవార్త:**సూపర్ జి ఎస్ టి, సూపర్ సేవింగ్స్ దేశవాళీ కార్యక్రమంలో భాగంగా కావలి పట్టణంలోని నారాయణ హై స్కూల్ ను మంగళవారం కావలి మండల విద్యాశాఖ అధికారి బండి గోవిందయ్య, మండల పన్నుల శాఖ కమిషనర్ రమేష్ లు సందర్శించి సూపర్ జి.ఎస్.టి,సూపర్ సేవింగ్స్ పై విద్యార్థిని,విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రాముఖ్యతను తెలియజేసి మధ్య తేడాను వివరించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏర్పాటుచేసిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేయడం జరిగింది.నాలుగవ వార్డ్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ దేశవాళీ కార్యక్రమంలో భాగంగా కావలి పాత ఊరు నాలుగో వార్డ్ లోని మున్సిపల్ ఉన్నత పాఠశాలను కావలి మండల విద్యాశాఖ అధికారి బండి గోవిందయ్య సందర్శించి సూపర్ జీఎస్టీ ,సూపర్ సేవింగ్స్ యొక్క ప్రాముఖ్యతను విద్యార్థిని విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి కి కనుగోలమ్మ తల్లి ఆశీస్సులు ఉండాలి



**కావలి, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** కావలి మాజీ శాసనసభ్యులు, కావలి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి కి వారి కుటుంబ సభ్యులకు కావలి గ్రామ దేవత శ్రీ కనుగోలమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని మంగళవారం బిసి ఉద్యమ రాష్ట్ర నాయకులు, కావలి బిసి భవన్ వ్యవస్థాపక అధ్యక్షులు ద్రోణాదుల వెంకట్రావు,వాసంతి దంపతుల ఆధ్వర్యంలో కలుగోళ శాంభవి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ద్రోణాదుల వెంకటరావు మాట్లాడారు ఇటీవల కాలంలో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి పై అక్రమ కేసులు బనాయించడం జరిగిందని తెలియజేశారు. అవేమీ కాకుండా చూడాలని కలుగోలమ్మ తల్లికి మొక్కుకోవడం జరిగిందని తెలియజేశారు.అక్రమ కేసుల చెర నుండి ప్రజల్లో కి వచ్చిన సందర్భంగా అమ్మవారికి మొక్కును తీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగిందని మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు కూడా అమ్మవారి ఆశీస్సులు ఉండాలని తెలియజేశారు. అనంతరం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివ కుమార్ రెడ్డి మాట్లాడారు కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డికి మరో మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డిలకు ఎటువంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. వారిద్దరి మధ్య విభేదాలను సృష్టించడం మంచి పద్ధతి కాదని తెలియజేశారు. రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కావలి నియోజకవర్గం లో బలంగా ఉందని తెలియజేశారు. కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డికి సి.ఈ.సి మెంబర్ గా పదవి లభించినందుకు సంతోషంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులు కనమర్లపూడి వెంకటనారాయణ, వైసిపి నాయకులు పాలవల్లి పద్మనాభరెడ్డి, చేన్ను ప్రసాద్ రెడ్డి, కుందుర్తి కామయ్య, ఆర్ కే డాబా కృష్ణారెడ్డి, కొమరి రాజు వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ పై దాడి హేయమైన చర్య



**కావలి, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయ్ పై దాడికి ప్రయత్రించడం హేయమైన చర్య అని న్యాయవాది, సామాజిక కార్యకర్త ఐ.సాయి ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో ఖండించడం జరిగింది. సోమవారం. ఒక సీనియర్ వాది కోర్టు హాలులో ప్రధానన్యాయ మూర్తి జస్టిస్ గవాయ్ పట్ల అగౌరవంగా, నీచమైన రీతిలో దాడికి ప్రయత్నం చేయడం ప్రజాస్వామ్య దేశంలో (కానిస్టుషన్) భారత రాజ్యాంగం పై దాడి అని తెలిపారు. ప్రజాస్వామ్య దేశంలో సుప్రీం కోర్టు అనేది ఒక సర్వోన్నతమైన భాగమని దానికి నియమించిన ప్రధాన న్యాయమూర్తి అత్యంత కీలకమైన వ్యక్తి అని తెలియజేశారు. రాష్ట్రపతి తో సమానమైన,స్వతంత్ర శక్తి, సామర్థం కలిగిన గౌరవప్రదమైన భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయ మూర్తి పై దాడికి పాల్పడడం మొత్తం భారత దశానికి మాయని మచ్చ అని,ఇటువంటి సంఘనటలు జరగడం చాలా బాధాకరం అని తెలిపారు.

## పీయంపిలచే జెడ్పీ హైస్కూల్‌కు బీరువా బహుకరణ



**గోనుపల్లి(రాపూరు), అక్టోబర్ 7, ప్రభాతవార్త :** మండలంలోని గోనుపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పియంపీ జిల్లా ఆధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ బీరువాను బహుకరించారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన తన బార్య కీర్తిశేషులు శాఖవరపు చంద్రకళ మూడవ వర్ధంతిని పురస్కరించుకోని ఈ బీరువాను పాఠశాలకు బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేతా వెంకు రెడ్డి మాట్లాడుతూ పీయంపీ వైద్యుల జిల్లా ఆధ్యక్షుడైన శాఖవరపు వేణుగోపాల్ తన భార్య జ్ఞాపకార్థం తమ పాఠశాలకు బీరువా బహుకరించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూడ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ షేక్ రసూల్, ప్రైమరి స్కూల్ ప్రధానోపాధ్యాయుడు అచ్యుత మణి, ఉపాధ్యాయులు స్వరూప, భాగ్యలక్ష్మి, విజయ, జిల్లా పిహెచ్‌సీ నాయకులు శాఖవరపు వేణుగోపాల్, దేవరకోండ శ్రీనివాసులు, అలూరు రాజేశ్వర రావు, బైరి శంకర్రావు, పెళ్లూరి కృష్ణయ్య, కోమెర్ల యోహాన్ బాబు తదితరులున్నారు.

## మహర్షి వాల్మీకికి ఘన నివాళులు



**కోవూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** రామాయణ సృష్టికర్త శ్రీ వాల్మీకి మహర్షి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా జరుపుకోవాలని ఆదేశాలిచ్చిన నేపథ్యంలో మంగళవారం కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో ఆ మహనీయుని చిత్రపటానికి తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ మహనీయుడు రచించిన రామాయణ కావ్యం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు బషీర్, సతీష్, మధుసూదన్‌రావు, సీనియర్ అసిస్టెంట్లు రమణయ్య, శ్రీనాథ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, జూనియర్ అసిస్టెంట్లు, గ్రామ రెవెన్యూ అధికారులు ఉన్నారు.

## మెనూను సక్రమంగా అమలు చేయాలి



**కోవూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పక అమలు చేసేలా మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలు తగు చొరవ తీసుకోవాలని ఎంఈవో-2 వై. చెంచులక్ష్మమ్మ అన్నారు. కోవూరులోని పెళ్లకూరు కాలనీలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఆమె భోజన సమయంలో పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిరోజూ నిర్దేశించిన మెనూను ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందని,దాని ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందించేలా ఏజెన్సీలు తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

## లబ్ధిదారులకు సిమెంట్, ఇంటికి కావాల్సిన సామాగ్రి అందుబాటులో ఉంది

## హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్



**కోవూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** జిల్లా వ్యాప్తంగా గృహ నిర్మాణాలు చేసుకునే లబ్ధిదారులకు సిమెంట్, ఇంటికి కావాల్సి న సామాగ్రి అందుబాటులో ఉందని, నిర్మాణాలు వేగవంతం చేసేలా లబ్ధిదారులు చొరవ తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్ అన్నారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న గృహ నిర్మాణ డీఈ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో గృహ నిర్మాణ శాఖకు సంబంధించి రెండు స్కీములు అములులో ఉన్నాయని, సుమారు 97 వేల నిర్మాణాలు జరుగుతున్నాయని, అందులో ప్రస్తుతం 30 వేలు పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు చేసుకునేందుకు ఎస్సీ, బీసీలకు 50 వేలు, ఎస్టీలకు 75 వేల రూపాయలను అదనంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. 31,650 ఇళ్లకు జిల్లాలో అదనపు ఆర్థిక సహాయం కింద ఉన్నాయన్నారు. మార్చిలోగా ప్రస్తుతం చేపడుతున్న నిర్మాణాలు పూర్తిచేసేలా లబ్ధిదారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రస్తుతం దీపావళి పర్వదినం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల ఇళ్ల ప్రారంభోత్సవం చేయాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, జిల్లాలో 21 వేల గృహాలు పూర్తి అయ్యి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. లబ్ధిదారుల్లో మరింత అవగాహన కల్పించేలా గృహ నిర్మాణ శాఖ డీఈ, ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తగు చొరవ తీసుకోవాలన్నారు. అంతకుముందు ఆయన గృహ నిర్మాణ శాఖ సంబంధించిన గోదామును పరిశీలించి అందులో ఉన్న కిటికీలు, సిమెంట్, ఇతర వస్తువుల పరిశీలన చేపట్టారు. ఈ పరిశీలనలో ఆయన వెంట గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి డీఈ వెంకటేశ్వర్లురెడ్డి, తదితరులు ఉన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో పౌర్ణమి పర్వదినం సందర్భంగా ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం స్వామివారికి అత్యంత వైభవంగా పల్లకి సేవ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకిషోర్ స్వామి, ఫణీంధ్ర స్వామి, భక్తులు ఉన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో సెంట్రల్ టీమ్ బృందం సభ్యుల పరిశీలన





**కోవూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** కోవూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పాటూరు, విఘ్నేశ్వర పురం ,కోనేటికయ్యలు, బుచ్చి మండలం రామచంద్రాపురం, కొడవలూరు మండలం నాయుడు పాలెం అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుంచి వచ్చిన సెంట్రల్ టీమ్ బృందం సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు నిశిత పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులతోనూ, విద్యార్థుల తల్లులతోనూ దాదాపు మూడు గంటల పాటు ప్రశ్నల వర్షం కురిపించి పలు విషయాలను వారి నుంచి రాబట్టారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా.. మీ బిడ్డల ఎత్తు, బరువులను ప్రతి నెల తూస్తున్నారా.. గర్భవతులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా అందిస్తున్నారా అనే విషయాలను ప్రశ్నించి తెలుసుకున్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలు పరిశుభ్రంగా ఉంటున్నాయా.. కేంద్రంలో సక్రమంగా ఆహారాన్ని వండి పెడుతున్నారా అనే విషయాలను చిన్నారుల ఇంటికి వెళ్లి తల్లులను ప్రశ్నించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారుల తల్లులు, గర్భవతులు, బాలింతలు తమకు అంగన్‌వాడీ కేంద్రం నుంచి సక్రమంగా పౌష్టికాహారం అందిస్తున్నారని, తమ బిడ్డలకు ఆట పాటలతో కూడిన విద్యను అందిస్తున్నారని ఈ సందర్భంగా వారు సెంట్రల్ టీమ్ బృందం సభ్యులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ పరిశీలనలో ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో శారద, సూపర్‌వైజర్లు ఉమా, పద్మావతి, సుమిత్ర, నాగభూషణమ్మలు ఉన్నారు.

## బట్రకాగోళ్ళు లో పశువైద్య శిబిరం



అల్లూరు, అక్టోబరు 7, ప్రభాతవార్త : అల్లూరు మండల పరిధిలోని బట్రకాగోళ్లు గ్రామంలో మంగళవారం నిర్వహించిన పశువైద్య శిబిరం లో డాక్టర్ మల్లారెడ్డి డి డి ఏ హెచ్ కావలి. డాక్టర్ శ్రీనివాసరావు ఈఓడిఎల్డిఏ కోవూరు. పాల్గొనగా ఈ వైద్య శిబిరం లో 78 పశువులకు సూటి పరీక్షలు. 25 దూడలకు నట్ట నివారణ చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పరమేశ్వరయ్య ఏ డి అల్లూరు.డాక్టర్ అబ్దుల్ రహీం నార్త్ మెపూర్. మరియు అల్లూరు పశువైద్య సిబ్బంది. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోరంబోకు స్థలం ఇస్తే కూరగాయలు సాగు చేసుకుంటాం



**కోవూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ పరిధిలోని చంద్రమౌళినగర్ గిరిజన ప్రాంతానికి చెందిన గిరిజనులు కోవూరు నుంచి గుమ్మలదిబ్బ ప్రాంతంలో ఉన్న గిరిజనులు మంగళవారం టీడీపీ నాయకులు లోక్‌సాయి ఆధ్వర్యంలో కోవూరు తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ ప్రాంతంలో చెరువు పక్కన ప్రభుత్వానికి సంబంధించిన పోరంబోకు స్థలం ఉందని, దానిని గిరిజనులకు ఇస్తే ఆకుకూరలు, కూరగాయలు పండించుకుంటామని ఈ సందర్భంగా వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల ప్రకారం నడుచుకుంటామని తహసీల్దార్ వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా ప్రాంతాలకు సంబంధించిన గిరిజనులు ఉన్నారు.

## మండల అభివృద్ధికి అందరి సహకారం అందించాలి



**రాపూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** రాపూరు మండల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారం అందించాలని యంపీపీ కుమ్మరిగుంట ప్రసన్న కోరారు. మంగళవారం రాపూరు మండల సర్వసభ్య సమావేశం యంపీపీ కుమ్మరిగుంట ప్రసన్న ఆధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు వారి శాఖల ద్వారా ప్రస్తుతం చేస్తున్న అభివృద్ధి పనులు, ఇంకా చేయాల్సి న పనుల పురోగతిని వివరించారు. పలువురు యంపీటీసీలు గ్రామాలలో అవసరమైన మౌళిక వసతులు కల్పించాలని కోరారు.ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు చిగురుపాటి ప్రసన్న, రాపూరు పిఎసిఎస్ ఛైర్మన్ దందోలు వెంకటేశ్వర రెడ్డి, యంపీడీఓ మారెళ్ళ భవాని, మండల ఉపాధ్యక్షులు పోలంరెడ్డి పెంచల రెడ్డి, వెంకట స్వామి, కో ఆప్షన్ సయ్యద్, పలువురు యంపీటీసిలు,పలు గ్రామాల సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నృసింహుని నిత్యఅన్నదానానికి రూ. 1 లక్ష విరాళం

**పెంచలకోన(రాపూరు), అక్టోబర్ 7, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి నిత్య అన్నదానానికి మంగళవారం స్వామి వారి భక్తులు రూ. 1 లక్ష విరాళం ఆందజేసినట్లు ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. నెల్లూరు టౌన్ వాస్తవ్యులు కీ.శే పూవేటి పరంధామి రెడ్డి జ్ఞాపకార్థం వారి ధర్మపత్ని అరుణమ్మ 1 లక్ష విరాళాన్ని ఆఅందజేసినట్లు ఆయన తెలిపారు.

## ఆశ్రమపై అభివృద్ధికి ఈవో విశేష కృషి



**వెంకటాచలం,అక్టోబరు7,ప్రభాతవార్త:** భగవాన్ వెంకయ్య స్వామి ఆశ్రమ అభివృద్ధికి ఈవో బాలసు బ్రహ్మణ్యం విశేషంగా కృషి చేసి తిరుమల తరహాలో భగవాన్ వెంకయ్య స్వామి ఆశ్రమాన్ని అభివృద్ధి చేశారని అలాంటి వారిపై అసత్య ఆరోపణలు చేయటం మంచి పద్ధతి కాదని భాజాపా జిల్లా అధ్యక్షులు వంశీధర్ రెడ్డి పేర్కొన్నారు.మంగళవారం వెంకటాచలంలో భాజాపా కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఒక్క రూపాయి జీతం లేకుండా దేవాలయ అభివృద్ధికి ఈవో బాల సుబ్ర హ్మణ్యం కృషి చేశారన్నారు ఆయన 2006 లో బాధ్యతలు చేపట్టి నాటి నుండి ఇప్పటి వరకు విద్య, వైద్యం,భక్తులకు వసతి సదుపాయం కల్పించారన్నారు.అలాంటి వారిపై వెంకయ్య స్వామి కుటుంబ సభ్యులు అని చెప్పుకునేవారు స్వామి సమాధి అయినప్పుడు కాని,గొలగమూడిలో స్వామి సమాది అయినప్పుడు కనపడేదన్నారు.అప్పుడు కనుపడని కుటుంబ సభ్యులు ఇప్పుడు వచ్చి ఆశ్రమం గురించి,గొలగమూడి భక్తులు గురించి కమిటీ సభ్యులు గురించి ఈవో గురించి మాట్లాడటం ఎమిటి అని ప్రశ్నించారు.భక్తుల మనోబావాలు దెబ్బ తినే విదంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని గొలగమూడి ఆశ్రమం,ఈవో బాల సుబ్రహ్మణ్యంకు భాజాపా పార్టీ ఎప్పుడు అండగా ఉంటామన్నారు.ఈ కార్యక్రమంలో భాజాపా నాయకులు కుంచే శ్రీనివాసుల యాదవ్,మండల అధ్యక్షులు హసనాపురం శ్రీనివాసులు ఆరుమూళ్ళ మురళి తదితరులు పాల్గొన్నారు.

## మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు



**కొడవలూరు, అక్టోబర్ 7 ప్రభాతవార్త:** మండల తహశీల్దార్ కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుక తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం, జిల్లా అధికారుల సూచనల మేరకు మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు జరుపుకోవడం జరిగిందన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీ ల్దార్ సారంగపాణి, మస్తాన్ బాబు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ హైమావతి, మండల సర్వేయర్ మహేశ్వరరావు, వీఆర్వోలు, సిబ్బంది ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి ని కలిసిన విజయ్ కుమార్ రెడ్డి



**కావలి, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** కావలి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ని కావలి పట్టణంలోని వారి నివాసంలో మంగళవారం కావలి 26 వార్డు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వేమిరెడ్డి విజయ్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి 26వ వార్డులోని పలు సమస్యల గురించి తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి సమస్యల పరిష్కారం కోసం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేయడం జరిగింది.

## విద్యుత్ భవన్‌లో మహర్షి వాల్మీకి జయంతి



నెల్లూరు, అక్టోబర్ 7, ప్రభాత వార్త-వైద్యం : విద్యుత్ భవన్‌లో మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కే.రాఘవేంద్ర మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రపంచానికి రామాయణం అనే మహాకావ్యాన్ని అందించిన మహర్షి వాల్మీకి సేవలు అపారమని, వేటగాడైన వాల్మీకి రామనామాన్ని జపిస్తూ మహర్షిగా మారిన తిరు అందరికి ఆదర్శ ప్రాయమని తెలిపారు. మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకోవడమ మనందరికి గౌరవకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ శేషాద్రి బాలచంద్ర, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ శ్రీధర్, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ అల్తాఫ్, పర్సనల్ ఆఫీసర్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్యం కోసం పోషణమా మాసోత్సవం సిడిపిఒ




ఆత్మకూరు ,అక్టోబరు7,ప్రభాతవార్త : మహిళల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని అందుకు సరికొత్త రాష్ట్రీయ పోషణమా కార్యక్రమాన్ని రూపొందించి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గ్రామగ్రామాన ముమ్మరంగా సదస్సులను నిర్వహిస్తూ వారికి అవగాహన కల్పిస్తున్నామని ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి పి.సునీలత పేర్కొన్నారు. పోషణమాసోత్సవంలో భాగంగా మంగళవారం ఆత్మకూరులోని ఎల్ఆర్‌పల్లి-2 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, సిడిపిఒ పి.సునీలత హాజరయ్యా రు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలు, గర్భవతులు, బాలింతలు, కిశోరబాలికలు, మహిళలు తగినంతగా పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. చిన్నారులతో స్థూలకాయం నివారణ, బాల్యదశసంరక్షణ, విద్య, శిశువులు, చిన్నిపిల్లల అలవాట్లు, పిల్లల సంరక్షణలో పురుషుల భాగస్వామ్యం తదితర అంశాల గురించి వివరించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో 0-6సంవత్సరాల పిల్లలకు పోషణ, ఆరోగ్యం, పెరుగుదల, 3-5సంవత్సరాల పిల్లలకు మంచి అలవాట్లు , ఆట పాటలతో విద్య, పోషణ తదితర కార్యక్రమాలను అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహిస్తున్నారని కావున తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు సెక్టార్ సూపర్‌వైజర్ జి.కస్తూరి , ఆత్మకూరు పట్టణంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భవతులు, బాలింతలు, కిశోరబాలికలు, మహిళలు , ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈకే వైసి చేయించుకుంటేనే ఉపాధీహామి పనులు : ఏపిఓ రాజమ్మ



**మనుబోలు అక్టోబర్ 7 ప్రభాతవార్త :** ఉపాదీ హామి పనులకు తప్పనిసరిగా ఈ కెవైసి చేయించుకోవాలని ఏపిఒ రాజమ్మ సూచించారు. మంగళవారం ఆమె ఉపాధీ హామి కార్యాలయంలో మాట్లాడారు. జాబ్‌కార్డును ఆధార్ కార్డుతో అనుసంధానం చేయడం వల్ల నకిలీ హాజరుకు చెక్ పెట్ట వచ్చునని తెలిపారు. హాజరు విధానంలో పాదర్శకత పెరుగుతుందన్నారు. కార్మికుల హాజరును నేషనల్ మొబైల్ మానిటర్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. కాని కొందరు నకిలీ పోటోలను ఒకరికి బదులుగా మరొకరు వచ్చినా అంతా సక్రమంగానే ఉన్నట్లు యాప్ అప్‌లోడు చేస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించందన్నారు. మరోవైసు సామాజిక తనీఖీల్లో అక్రమాలు బయటపడుతూనే ఉన్నాయి. వీటిని అరికట్టేందుకు కేంద్రం ఎన్ఎంఎంఎస్ యాప్ తీసుకొచ్చిందన్నారు. దీనిని సైతం దుర్వినియోగం చేస్తున్నట్లు గుర్తించిందన్నారు. దీంతో కార్మికులకు ఆశించిన స్థాయిలో వేతనాలు అందడం లేదన్నారు. ఉపాధీహామి పథకం కింద జాబ్‌కార్డులో నమోదై ఉన్న క్రీయాశీల కార్మికులకు ఎన్ఎంఎస్ మెబైల్ యాప్ పే స్యార్డీయాప్ ద్వారా ఈకే వైసి చేస్తున్నారన్నారు. క్షేత్ర సహాయకులు లేదా సీనియర్ మేట్లు ఈప్రక్రియను పర్యవేక్షించి పూర్తి చేయాలని ఆదేశించారు. నమోదు గడువు ఇవ్వక పోయినప్పటికి సాధ్యమైనంత త్వరగా ప్రక్రియను పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు ఏపిఒ తెలిపారు. ఈకార్యక్రమంలో టిఏ గుర్రప్ప డివో రాజేశ్వరీ, సిబ్బంది భవానీ, తదితరులు పాల్గోన్నారు.

## ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



**సీతారామపురం అక్టోబర్ 7 ప్రభాతవార్త :** మండల పరిషత్ కార్యాలయంలో వాల్మికీ జయంతి వేడుకలను ఎంపిడిఒ కార్యాలయం సిబ్బంది ఘనంగా నిర్వహిం చారు. ముందుగా వాల్మికి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మికి మహర్షి చూపిన అడుగు జాడలలో ప్రతి ఒక్కరు నడవాలని తెలి పారు. బోయరత్నాకరుడు మహర్షి వాల్మీకి గా మారా డని నేటి సమాజానికి ఆయన బోధనలు ఆచరణ నీయమని అన్నారు. వాల్మీకి మహర్షి జయంతి సంద ర్భంగా వారి సూక్తులను కార్యాలయ సిబ్బంది గుర్తుకు తెచ్చుకున్నారు.

## అనుబంధ సంఘాలతో వర్క్‌షాప్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి : ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి



**నెల్లూరు రూరల్, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర నియోజకవర్గ అనుబంధ సం ఘాల అధ్యక్షులతో వైస్సార్సీపీ నగర ఇన్‌చార్జ్ ఎమ్మె ల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి రాంజీనగర్ ఆఫీస్‌లో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతమే ప్రతి కార్యకర్త యొక్క ప్రధాన ధ్యేయంగా ఉండాలని సూచించారు. పార్టీ నిర్వహించే ప్రతి కార్యక్రమం విజయవంతం కావడానికి అనుబంధ సంఘాలు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీ కార్యక్రమాల పట్ల ఉత్సాహంగా ఉన్న యువతను ఎంపిక చేసి వారిని చురుకుగా భాగస్వామ్యం చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో వైయస్ జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా అందరూ ఏకతాటిపై పనిచేయాలి అని పిలుపునిచ్చారు.

## జీఎస్‌టీ 2.0 సంస్కరణలతో ప్రజలకు ఊరట : గిరిధర్ రెడ్డి



**నెల్లూరు రూరల్, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని నెల్లూరు కూర గాయల మార్కెట్‌లో జీఎస్‌టీ 2.0 సంస్కరణలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, నెల్లూరు ఎఎంసి చైర్మన్ మనుబోలు శ్రీధర్ రెడ్డి పాల్గొని ప్రజలకు, వ్యాపారులకు కొత్త సంస్కరణల వల్ల కలిగే లాభాలను వివరించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వానికి ప్రధాన ధ్యేయమని తెలిపారు. జీఎస్‌టీ 2.0 అమలుతో రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజలకు గణనీయమైన ఊరట లభించిందని చెప్పారు. దేశ వ్యాప్తంగా దాదాపు 83 రకాల వస్తువులపై పన్నులు తగ్గడంతో పాల ఉత్పత్తులు, హార్డ్‌వేర్, వ్యవసాయ పనిముట్లు, పుస్తకాలు, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని వివరించారు. వ్యాపారులకు, దుకాణదారులకు జీఎస్‌టీ 2.0 ద్వారా కలిగే లబ్ధి గురించి స్పష్టంగా వివరించామని, ధరల తగ్గింపుతో స్థానిక వ్యాపారాలు అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విజనరీ నిర్ణయాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మద్దతు తెలపడం ద్వారా దేశ ఆర్థిక రంగానికి కొత్త దిశ నిర్దేశం చేశారని గిరిధర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ జలదంకి సుధాకర్, ఎ.ఎం.సి. వైస్ చైర్మన్ రాపూరు శేఖర్, ఎ.ఎం.సి. డైరెక్టర్లు శివకుమార్, సాయి లక్ష్మణ్, సుధాకర్, బాబు, సురేష్, గునుకుల విజయలక్ష్మీ, సురేఖ, ప్రసూన, శైలజ, దాసరి లక్ష్మి, అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా జీఎస్‌టి 2.0 సంస్కరణలు సామాన్య ప్రజల నుండి వ్యాపార వర్గాల వరకు అందరికీ సానుకూల మార్పులు తీసుకొచ్చే దిశగా సాగుతున్నాయని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## తగ్గిన జి.ఎస్.టి.తో వినియోగదారులకు భారీగా ప్రయోజనం

**– టీడీపీ రాష్ట్ర నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి**



**నెల్లూరు అగ్రికల్చర్, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** ప్రభుత్వం తగ్గించిన జి.ఎస్.టి.తో ప్రజలకు, వినియోగదారులకు మార్కెట్ వ్యాపారులకు భారీగా ప్రయోజనం చేకూరుతుందని టీడీపీ రాష్ట్ర నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం ఆయన నెల్లూరులోని ఏసీ కూరగాయల మార్కెట్‌లో విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగా ఏసీ మార్కెట్‌కు విచ్చేసిన ఆయనకు, ఏఎంసీ చైర్మన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డి, వ్యాపార సంఘాల నేతలు ఘన స్వాగతం పలికారు. శాలువాలతో సత్కరించారు. అనంతరం గిరిధర్‌రెడ్డి తగ్గిన జి.ఎస్.టి. పై వ్యాపారులకు, వినియోగదారులకు అవగాహన కల్పించారు. తగ్గిన జి.ఎస్.టి. ప్లెక్సీతో మార్కెట్లో కలియతిరిగారు. దాదాపు 99%శాతం వస్తువులపై 18%శాతం నుంచి 5% శాతానికి అంతే కాకుండా కొన్ని వస్తువులకు జీరో శాతం కూడా జి.ఎస్.టి. తగ్గిందని ఆయన తెలియజేశారు. తగ్గిన జి.ఎస్.టి.కి అనుగుణంగా వ్యాపారులు విక్రయాలు సాగిస్తున్నారా లేదా వినియోగదారులు కూడా అడిగి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కల్పించిన జి.ఎస్.టి. ప్రయోజనాలు అందరికి అందాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డి, డైరక్టర్లు భీమతాటి సుధాకర్, కుప్పా ప్రసన్న, గునుకుల విజయలక్ష్మీ, వ్యాపార సంఘాల నేతలు రాతిరెడ్డి, మధు, గయాజుద్దీన్, వెంకటేశ్వర్లు, రాంబాబు, మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరక్టర్ అనిత కుమారి, ఆశాఖ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎం.శ్రీనివాసులు, మార్కెటింగ్ శాఖ సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.

## నాసిరకం, నకిలీ మందుల సమస్యను పరిష్కరించండి

**బిట్రగుంట, అక్టోబరు 7, ప్రభాతవార్త :** దేశంలో నాసిరకం మరియు నకిలీ మందుల సమస్యను సత్వరమే పరిష్కరించాలని ప్రజారోగ్యవేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం.వి.రమణయ్య, కామేశ్వరరావు లు కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం వారు సంబంధిత మంత్రిత్వశాఖలకు పంపిన వినతిపత్రం లో. ప్రస్తుతం ఈ సమస్య వల్ల ప్రాణాలకు ముప్పుగా ఉండడంతో పాటు మన ఔషధ రంగంపై ఉన్న ప్రజల నమ్మకాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. డైయిథిలిన్ గ్లైకాల్ (డిఈజి) తో కలుషితమైన దగ్గు మందు కారణంగా మధ్యప్రదేశ్ రాజస్థాన్ రాష్ట్రాలలో ఇటీవల12 మంది చిన్న పిల్లలు చనిపోవడం చాలా బాధాకరమన్నారు. రోగుల ప్రాణాలను కాపాడడానికి మరియు భారతదేశ ఔషధ నియంత్రణ చట్రాన్ని బలోపేతం చేయడానికి కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన తక్షణ అవసరాన్ని ఈ చంటి పిల్లల మరణాలు నొక్కి చెబుతున్నాయని వారు పేర్కొన్నారు. జనరిక్ మందుల తయారీలో ప్రపంచ అగ్రగామిగా ఉన్న భారతదేశం ఈ నాసిరకం ఔషధాల కారణంగా ప్రజారోగ్య సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ( సి డి ఎస్ సి ఓ ) డేటా ప్రకారం ఏటా పరీక్షించబడే నమూనాలలో 3 నుంచి 4 శాతం మందులలో నాణ్యతా ప్రమాణాలు తక్కువగా ఉన్నాయన్నారు. ఈ వైఫల్యంతో పాటు నాకే మందులు కూడా తోడై మందులకు క్రిమిసంహారక శక్తి తగ్గిపోయి చికిత్స ఫలితాలు సరిగా లేకపోవడం లాంటి తీవ్రమైన పరిణామాలకు దారి తీస్తున్నాయన్నారు.

చింద్వారా (మధ్యప్రదేశ్) సికార్ మరియు భరత్‌పూర్ (రాజస్థాన్)లలో జరిగిన ఇటీవలి సంఘటనలు తయారీ పర్యవేక్షణ, సరఫరా గొలుసు సమగ్రత మరియు నియంత్రణ అమలులో వ్యవస్థాగత వైఫల్యాలను స్పష్టంగా తెలియజేస్తున్నాయని, పారిశ్రామిక వృద్ధిని ప్రోత్సహించడం లక్ష్యంగా ప్రభుత్వం యొక్క వ్యాపారం సులభతరం విధానం ఔషధ నాణ్యత నియంత్రణను బలహీనపరిచిందని మేము విశ్వసిస్తున్నామన్నారు. తయారీదారుల స్వీయ ధృవీకరణపై ఆధారపడటం, సరిపోని తనిఖీలతో నాసిరకం నకిలీ మందులు విస్తరించడానికి దారితీసాయి. ముందుగా ప్రకటించిన తనిఖీలు రాష్ట్ర ఔషధ నియంత్రణ విభాగాలలో సిబ్బంది కొరత ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తుంది. దీనివల్ల మందుల తయారీలో మంచి తయారీ పద్ధతులు (జి ఎం పీ ) పాటించకపోవడానికి దారితీస్తుంది. రోగుల భద్రత, ప్రజారోగ్యం దృష్ట్యా నియంత్రణ చట్రాన్ని బలోపేతం చేసి నాసిరకం నకిలీ ఔషధాల తయారీదారులపై తప్పనిసరి రీకాల్ విధానాలు, కఠినమైన జరిమానాలు, వేగవంతమైన విచారణ జరపడానికి మందులు మరియు సౌందర్య సాధనాల(1940 ) చట్టాన్ని సవరించి. అన్ని ఔషధ కంపెనీలలో మంచి తయారీ విధానం (జి ఎం పీ ) కి అనుగుణంగా ఉండేలా అప్రకటిత తనిఖీలను అమలు చేయాలని డిమాండ్ చేసారు. ఇందుకు సంబంధించిన పలు సూచనలు వారు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు.

## స్కూల్ గేమ్స్ ఎంపికలు



**బిట్రగుంట, అక్టోబరు 7, ప్రభాతవార్త :** బోగోలు మండలం విశ్వనాథ రావుపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠ శాలలో మంగళవారం మండల స్థాయి లో క్రీడాపోటీలుకు ఎంపికలు నిర్వహి ం చారు. ఈ ఎంపికలో 8 పాఠశా లలకు సంబం దించిన విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు. 14, 17 సంవత్సరాలవయస్సు కలిగిన వారిని ఎంపిక చేసే కార్యక్రమం బుధవారం వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమం లో విశ్వనాధరావుపేట బాలుర, బాలికల ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు నీరజ, గంగాధర్, మండల టీడీపీ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం. నాగేశ్వరావు, ఎల్.సుధీర్ బాబు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, వివిధ పాఠశాలల వ్యాయమఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సోలార్ విద్యుత్‌పై జిల్లాలోని ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్స్, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్స్, సోలార్ వెండర్స్‌తో సమావేశం





**నెల్లూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త–వైద్యం :** పీఎం సూర్యఘర్ పథకంపై క్షేత్రస్థాయిలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి నిర్ధేశించిన లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కే.రాఘవేంద్ర, విద్యుత్ శాఖ అధికారులను, వెండర్స్‌ను కోరడమైంది. విద్యుత్ భవన్‌లోని స్కాడా సమావేశ మందిరంలో జిల్లాలోని అన్ని డివిజన్‌ల ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్స్, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్స్, జిల్లాలోని సోలార్ వెండర్స్‌తో ప్రత్యేక సమావేశమై సూర్యఘర్ పథకంపై అమలు జరుగుతున్న కార్యక్రమాల అమలు తీరును, పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా రాఘవేంద్రం మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అంతరాయం కలగకుండా సరఫరా చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పీఎం సూర్య ఘర్ పథకంపై ప్రజలకు విస్తృంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి నిర్ధేశించిన లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పీఎం సూర్య ఘర్ పథకం కింద ఇప్పటి వరకు 7803 దరఖాస్తులు రాగా, అందులో 2,370 దరఖాస్తులు గ్రౌండింగ్ చేయగా, 2,210 సోలార్ ఇన్సులేషన్ పూర్తి చేయడం జరిగిందని వివరించారు. మరియు 1873 మంది సబ్సిడీ పొందడం జరిగింది. రోజు వారీగా లక్ష్యాలను నిర్ధేశించుకుని జిల్లాలో పీఎం సూర్య ఘర్ అమలును వేగవంతం చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో అన్నీ వర్గాల ప్రజలను భాగస్వాములను చేసి అన్ని గ్రామాల్లోనూ సౌర విద్యుత్ వినియోగం పెరిగేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సౌర విద్యుత్ వినియోగం వలన కలిగే ప్రయోజనాలను, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీని ప్రజలకు వివరించాలని దిశా నిర్ధేశం చేశారు. క్షేత్ర స్థాయిలో ఏవైనా సమస్యలు ఉంటే తెలపాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో ప్రజలు సంతృప్తి చెందేలా విద్యుత్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో జిల్లా సూర్యఘర్ నోడల్ ఆఫీసర్ శేషాద్రి బాలచంద్ర, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ టౌన్ శ్రీధర్, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ రూరల్స్ సోమశేఖర్‌రెడ్డి, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ కోవూరు రమేష్ చౌదరి, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ కావలి బెనర్జీ, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఆత్మకూరు భాను నాయక్, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్స్, సోలార్ వెండర్స్ తదితరులు పాల్గొన్నారు.

## టీబీ లక్షణాలున్న వారిని గుర్తించండి




**నెల్లూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త–వైద్యం :** టీబీ లక్షణాలున్న వారిని సకాలంలో గుర్తించి, వారికి వైద్య సేవలు అందేలా కృషి చేయాలని నెల్లూరు లెప్రసీ ఎయిడ్స్, టీబీ నివారణాధికారి ఎస్కే ఖాదర్ వలీ పేర్కొన్నారు. నవాబుపేత రైతు బజార్ ప్రాంతంలో ఉన్న అర్బన్ ఆరోగ్య కేంద్రం, పీసీ నాయుడు స్ట్రీట్ ఆరోగ్య కేంద్రాలలో జరిగిన ఆశా డే సమావేశాల్లో ఆయన పాల్గొని వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. దగ్గు, జ్వరంతో ఉన్న వారిని గుర్తించి వైద్య పరీక్షలను నిర్వహించాలన్నారు. అలాంటి వారిలో ఎవరికైనా పాజిటివ్ నిర్ధారణ అయితే , ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో అందించే మందుల ద్వారా సకాలంలో నయం చేయవచ్చున్నారు. అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు ఇవ్వబడతాయని చెప్పారు. ఇంటెన్సీ ఫైడ్ టీబీ కాంపెయిన్‌లో భాగంగా పాపులేషన్ మొత్తాన్ని 100% శాతం స్క్రీన్ చేయాలని సూచించారు. లెప్రసీ, ఎయిడ్స్ వ్యాధులపై కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, టీబీ నివారణ సిబ్బంది, అర్బన్ ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, ఆశాలు, సీఓలు పాల్గొన్నారు.

## వాల్మీకి మహర్షికి ఘన నివాళులు



**వరికుంటపాడు, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా మండల తహసీల్దార్ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పసుపులేటి హేమత్ కుమార్ మాట్లాడుతూ రామాయణ మహాకావ్యాన్ని మానవాళికి అందించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని అన్నారు. లోకాభిరామున్ని దివ్య చరిత్రను లోకోత్తరం చేసిన ఆదికవి వాల్మీకి మహర్షి అని తెలిపారు. కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు మహాపురుషులు అవుతారన్న మాటలకు వాల్మీకి మహర్షి జీవితం ఒక ప్రత్యక్ష నిదర్శనమన్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అర్షద్, వీఆర్వోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా సభ్యత్వాలు నమోదు



**వింజమూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** వింజమూరు మండలంలో ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ కార్యవర్గ సభ్యత్వ నమోదు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఏపీఎన్ జీజీఓ తా లూకా అధ్యక్షులు వెలుగోటి మధు ఆధ్వర్యంలో కలిగిరి కొం డాపురం వింజమూరు మండలాలలో గవర్నమెంట్ ఉద్యో గస్తులు సభ్యత్వ నమోదు జరుగుతుంది. మంగళవారం మం డలంలోని చాకలకొండ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సభ్యత్వాలను నమోదు చేశారు. నవంబర్లో ఏపీఎన్‌జీజీఓ కార్యవర్గం ఎంపిక జరుగుతుందన్నారు. గవర్నమెంట్ ఉద్యోగుల సమస్యలు, వారి శ్రేయస్సు కొరకు ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లే ఏకైక ఉద్యోగుల సమాఖ్య ఏపీఎన్‌జీజీఓ నే అన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి సభ్యత్వం తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్జీవో కార్యవర్గం సభ్యులు జనరల్ సెక్రటరీ నరసయ్య, ఇతర సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక తనిఖీ గ్రామ సభ



**వింజమూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** మండలం లోని శంఖవరం పంచాయతీ సచివాలయంలో మంగ ళవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామ సభ డీఆర్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు 2024–25 ఆర్థిక సంవత్సరంకు పంచాయతీ పరిధిలో జరిగిన సుమారు 34 లక్షల రూపాయల పనులు వివరాలను గ్రామ సభలో తెలియజేశారు. అలాగే గ్రామంలోని 350 జాబ్ కార్డ్ దారులు చేసిన పని వివరాలను తెలియజేశారు. ఆర్టికల్చర్ ద్వారా చేపట్టిన పనులు సీసీ రోడ్ల సామాజిక పింఛన్ల పరిశీలన గురించి వివరించారు. ఈనెల 10వ తేదీన స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో జరిగే బహిరంగ ప్రజా వేదిక నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు భూమిరెడ్డి నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు భోగిరెడ్డి వెంకట రమణారెడ్డి, చెరువు ప్రెసిడెంట్ పెంచల్‌రెడ్డి, హజరత్ రెడ్డి, భక్తవత్సల్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ అజయ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు ఘటనపై విధులు బహిష్కరించిన లాయర్లు



**ఆత్మకూరు, అక్టోబరు7, ప్రభాతవార్త :** భారతదేశ అత్యుత్తమ న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో ప్రధానన్యాయమూర్తి జస్టీస్ బిఆర్‌గవాయి పై ఓ లాయరు దాడికి నిరసనగా ఆత్మకూరు బార్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం తమ విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. కోర్టు నుండి ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన తెలిపారు. భారతదేశ ప్రతిష్టమైన న్యాయవ్యవస్థ సుప్రీంకోర్టు న్యాయమూర్తిపైనే ఓ లాయర్ వ్యక్తిగత కక్షతో పాదరక్షలు విసరడం దేశ న్యాయవ్యవస్థపై దాడిగా తెలుపుతూ దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని నిరసన తెలిపారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు లాయర్ల అసోసియేషన్ అధ్యక్షులు సిరాజుద్దీన్ , సీనియర్ న్యాయవాది ఎల్.వి.రమణయ్య, శేషయారెడ్డి, నజీర్, నంద ఓబులేశు , తిరుపతమ్మ, మధు తదితరులు పఆల్గొన్నారు. వీరికి మద్ధతుగా ప్రజా సంఘాలు పాల్గొన్నాయి.

**గ్రామపంచాయతీ కార్యాలయము, నేలటూరు**
ముత్తుకూరు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

**బహిరంగ వేలము ప్రకటన** తేది: 08.10.2025

శ్రీయుత జిల్లా పంచాయతీ అధికారి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వారి ఉత్తర్వులు ఆర్. ఓ.సి.నెంబర్ 3421/ఎ2–2025,తేది:15.09.2025 ప్రకారం..
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా,ముత్తుకూరు మండలము, నేలటూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఉప్పుటేరు ఒడ్డున 86 హెక్టార్లలో గల, 18 హెక్టార్ల నందు అటవీ శాఖ వారిచే నాటబడిన సరుగుడు మరియు నానజాతి చెట్లు పక్కానికి వచ్చినందున వాటిని విక్రయించుకొను హక్కును తేది:15.10.2025 న, ఉదయం 11.30 గంటలకు నేలటూరు గ్రామ పంచాయతీ కార్యాలయం నందు బహిరంగ వేలం నిర్వహించబడును.
కావున బహిరంగ వేలం నందు పాల్గొనదలచిన వారు, అదే రోజు ఉదయం వేలం పాటకు ముందుగా 10,000/- రూపాయలు ధరావత్తు సొమ్ము చెల్లించి తగు రశీదు పొంది వేలం పాటలో పాల్గొనవలసిందిగా కోరడమైనది.
**గమనిక:** బహిరంగ వేలము ప్రభుత్వ మరియు గ్రామపంచాయతీ నిబంధనలకు లోబడి జరుగును.ఒకవేళ వేలంపాట రోజున ప్రభుత్వం సెలవు దినం ప్రకటించిన యెడల, తిరిగి మరుసటి రోజున కార్యాలయ పనివేళలో బహిరంగ వేలం నిర్వహించబడును. తదుపరి వివరాలు కొరకు కార్యాలయ పని వేళలలో నేలటూరు గ్రామపంచాయతీ కార్యాలయం నందు సంప్రదించగలరు.

**సం/- సి.హెచ్.ప్రసాద్,** పంచాయతీ కార్యదర్శి,
నేలటూరు గ్రామపంచాయతీ, ముత్తుకూరు మండలం

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అహ్మద్ మొహిద్దీన్



**ఆత్మకూరు, అక్టోబరు7, ప్రభాతవార్త :** ఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఉర్దూ లెక్చరర్‌గా పనిచేస్తున్న షేక్.అహ్మద్ మొహిద్దీన్ మంగళవారం రోడ్డుప్రమాదంలో మృతిచెందారు. ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఉర్దూ లెక్చరర్‌గా పనిచేస్తున్న ఈయన సెలవుపై తమ స్వగ్రామమైన నరసరావుపేటకు వెళ్ళారు. తమ గ్రామం నుండి గుంటూరు కు వెళుతున్న సమయంలో రోడ్డు ప్రమాదం జరిగి మృతి చెందారు. తమ కాలేజీ లెక్చరర్ మృతిచెందిన విషయం తెలిసినప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విషాదచాయలు అలుముకున్నాయి. ఎంతో సౌమ్యంగా అందరితో కలిసి మెలిసి నవ్వుతూ సన్నిహితంగా ఉండే తమ లెక్చరర్ మృతిచెందడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆవేద వ్యక్తం చేశారు.

## వన్యప్రాణుల సంరక్షణపై అవగాహనా సదస్సు



**మర్రిపాడు, అక్టోబరు 7, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన మర్రిపాడులోని ఉన్నతపాఠశాలలో మంగళశారం డిఆర్ఒ రవీంద్రబాబు ఆధ్వర్యంలో 71వ వన్యప్రాణి వారోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మలత, అటవీశాఖ సిబ్బంది , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు



**ముత్తుకూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** ముత్తుకూరులోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పి. స్వప్న ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పి. స్వప్న మాట్లాడుతూ మానవుని జీవన విధానానికి, ధర్మపాలనకు నిలువెత్తు సాక్షాత్కారం రామాయణమని, 23 వేల శ్లోకాలతో, ఏడు ఖండాలతో రామాయణ పవిత్ర మహాకావ్యాన్ని మనకు అందించిన గొప్ప మహర్షి వాల్మీకి అని కొనియాడారు. వాల్మీకి మహర్షి జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని, సాధారణ మనిషి నుంచి ఒక మహా ఋషిగా ఎదిగి, మనుషులు మహా ఋషులవుతారని నిరూపించిన వాల్మీకి జీవిత చరిత్ర ఒక ఉదాహరణ అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైలు కిందపడి యువకుని ఆత్మహత్య



**నెల్లూరు క్రైమ్, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** గుర్తుతెలియని యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెన్నా నది రైల్వే వంతెన సమీపంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. మృతునికి సుమారు 25 ఏళ్ల వయసు ఉంటుందని, మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని, నలుపు రంగు గల ఫుల్ హాండ్స్ టీ షర్ట్, నలుపు కలర్ నైట్ ప్యాంటు ధరించి ఉన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి రైల్వే ఎస్సై హరిచందన కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## అంధుల పాఠశాలలో బాలబాలికలకు పండ్లు వితరణ



**నెల్లూరు, అక్టోబర్7, ప్రభాతవార్త:** నెల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రి దగ్గరలో ఉన్నవిశ్వ భారతి అంధుల పాఠశాలలోని బాల బాలికలకు పొదలకూరు మండలంలోని బిరదవోలు చెర్లోపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచే స్తున్న ఎం సుధాకర్ రావు మంగళవారం పండ్లు అంద జేశారు.

## మృతిచెందిన వారికుటుంబాలకు నగదు విరాళం



**ఆత్మకూరు, అక్టోబరు7, ప్రభాతవార్త :** ఆత్మకూరు పట్ట ణంలోని పేద ప్రజల కష్టాలను తీర్చడానికి నేను న్నానంటూ శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ కంచిపరమేశ్వర్‌రెడ్డి అండగా నిలుస్తున్నారు. మంగళ వారం ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలో కంచిపర మే శ్వర్‌రెడ్డి ఇటీవల మృతిచెందిన మొలబంటి కొండయ్య, షేక్ అహ్మద్‌బాషా, కల్లె చక్రప్ప, షేక్ ఖాదర్‌హుసేన్, సయ్యద్ ఖాసిం, పెళ్ళూరు విశ్వనాథం, షేక్ సుల్తా న్‌మొహిద్దీన్, రాగి పెంచలమ్మ, వింజమూరు పెదరంగయ్య, తురిమెర్ల ప్రభాకర్‌ల నివాసాలకు స్వయంగా వెళ్ళి వారికుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపి ధైర్యం చెప్పారు. అనంతరం ఆ కుటుంబాలకు 10వేల రూపాయల వంతున ఆర్థికసాయం అందజేశారు. ఈసందర్భంగా లబ్ధిపొందిన వారు మాట్లాడుతూ పరమేశ్వర్‌రెడ్డి ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రి లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం వలన పేదవారి ఆకలి తీరుతుందన్నారు. ఆయన ఏర్పాటు చేసిన మజ్జిగ , మంచినీటి చలివేంద్రాల వలన ఎంతోమంది దాహార్తిని తీరుస్తున్నారని వారు ఈసందర్భంగా పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా వాల్మీకి జయంతి



**నెల్లూరు అగ్రికల్చర్, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** నెల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను నిర్వహిం చారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి ఆర్డీఓ ఎన్ఎస్ అనూష నేతృత్వంలో పూలమాల వేసి నివాళులర్పి ంచారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రచించిన రామా యణ ఇతిహాస గ్రంధం సమాజంలో విలు వలు, విశ్వస నీయ తను ప్రతిబింబించే దిక్సూచిలా మారిందని తెలిపారు. వాల్మీకి జీవితం అందరికి ఆదర్శ ప్రాయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సూపర్ జి. ఎస్.టి, సూపర్ సేవింగ్స్ పై అవగాహన




**కావలి, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** కావలి సర్కిల్, నెల్లూరు విభాగానికి చెందిన రాష్ట్ర పన్నుల సహాయ కమిషనర్ పి.ఎస్.ఎస్. వర ప్రసాద్ రావు జి.ఎస్.టి 2.0 సూపర్ జి.ఎస్.టి, సూపర్ సేవింగ్స్ పై అవగాహన కార్యక్రమాన్ని మంగళ వారం రుద్రకోట, కావలి గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజి నందు నిర్వహించడం జరిగింది. ఈ సంద ర్భంగా వరప్రసాదరావు ప్రత్యక్ష పన్నులు డైరెక్ట్ టాక్స్ మరియు పరోక్ష పన్నులు మధ్య తేడాను వివరించి, వ్యాట్, జనరల్ సర్వీస్ టాక్స్ వంటి పన్నులను ఏకీకృతం చేసి ఏర్పడిన సరుకులు మరియు సేవల పన్ను (జి. ఎస్. టి) వ్యవస్థ గురించి వివరించారు. జి.ఎస్.టి లో ఉన్న ఐదు పన్ను శ్రేణులు, 0 శాతం, 5 శాతం, 12 శాతం, 18 శాతం, 28 శాతం గురించి తెలియజేసి ప్రస్తుతం అమలులో ఉన్న జిఎస్టి 2.0 లోని 5 శాతం మరియు 18 శాతంపన్ను విధానాలు ఏ విదంగా సామాన్య ప్రజలకు ఉపయోగమో తెలియచేశారు. మేక్ ఇన్ ఇండియా, వికసిత్ భారత్ కార్యక్రమాల ప్రాధాన్యతను వివరించి, కేంద్ర ప్రభుత్వం మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న ఆర్థిక సంస్కరణలలో జి.ఎస్.టి యొక్క కీలక పాత్రను వివరించారు. అలాగే, సూపర్ జి.ఎస్.టి ద్వారా సాధించబడిన సూపర్ సేవింగ్స్ గురించి కూడా వివరించారు. రైతులు, విద్యార్థులు, వ్యాపారులు వంటి వర్గాలకు లభిస్తున్న లాభాలను గుర్తు చేశారు. ట్రాక్టర్స్, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు, ఇంటి అవసరాల వస్తువులు వంటి అంశాలపై పన్ను తగ్గింపుల వలన సాధారణ ప్రజలకు ఉపశమనం కలుగుతుందని తెలిపారు. మొత్తంగా, జి.ఎస్.టి 2.0 మరియు సూపర్ జి.ఎస్.టి పథకాలు ప్రజలకు సౌలభ్యం కలిగించేలా, పన్ను వ్యవస్థను సరళతరం చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కావలి గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ సుశీల్ కుమార్ ప్రియ, ఎలక్ట్రికల్ విభాగ అధిపతి సుబ్బన్న, సివిల్ ఇంజనీరింగ్ విభాగ అధిపతి శ్రీనివాస్ రెడ్డి, మరియు జనరల్ సెక్షన్ విభాగ అధిపతి మరియు ఆంగ్లభాష ఉపన్యాసకులు కృష్ణయ్య మరియు వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీఓ సమీక్ష



**నెల్లూరు అగ్రికల్చర్, అక్టోబర్ 7, ప్రభాతవార్త** ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాన ప్రశాంత వాతావరణంలో జరిగేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని, నెల్లూరు ఆర్డీఓ ఎన్ ఎస్ అనూష సూచించారు. ఆర్డీఓ కార్యాలయం లోని తన ఛాంబర్లో మంగళవారం రూరల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని రాజకీయ పార్టీ ల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాలను పరిశీలించి సవరణలను తెలపాల న్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీల ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. ఏఈఆర్ఓలు నిర్మలానంద బాబా, చెన్నుదు, నెల్లూరు రూరల్ ఈడీటీ వరాలు, ఈడీటీ ఎస్కే జమీర్ భాష, ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏంది జగనన్నా.. మీ నోటి వెంట నీతిసూక్తులా..

### - వైసీపీ ప్రభుత్వ లిక్కర్ పాపాలను కడిగేసిన టీడీపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే



**నెల్లూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త-వైద్యం :** దెయ్యాలు వేదాలు వల్లించడం జగన్ కల్తీ లిక్కర్ గురించి మాట్లాడటం నూటికి నూరుశాతం ఒక్కటే అని టీడీపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎద్దేవ చేశారు. మంగళవారం సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించి మట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.3500 కోట్ల స్కామ్‌తో ప్రజల ప్రాణాలతో ఆడుకున్న ప్రభుత్వంమీది. మీ అక్రమార్జన కోసం నాణ్యత లేని జే బ్రాండ్స్‌తో వేలమంది ప్రాణాలుతీసి లక్షల మంది ఆరోగ్యాన్ని దెబ్బతీసి అనేక కుటుంబా లను ఆర్ధికంగా నాశనం చేసిన జగన్‌రెడ్డి ఏ మొహం పెట్టుకుని మీ లిక్కర్ పాలసీని సమర్ధించుకుంటావ్..? ప్రపంచ రాజకీయ చరిత్రలో మీలా ఇంత పచ్చి అబద్దాలు ఆడే మరొక నాయకుడు ఉండడు.. ఉండబోడు. క్యాష్ అండ్ క్యరీ సిస్టమ్‌తో జే బ్రాండ్ మద్యమే తాగాలనే కండీషన్ పెట్టి, వేల మంది ప్రాణాలను తీసి, లక్షల మందిని ఆసుపత్రి మంచమెక్కించిన జగన్‌అన్న.. మీ బిడ్డమీబిడ్డ అంటూ ప్రజల బుర్ర ముంచావ్. మద్యం తయారీ, సరఫరా అమ్మకం ఇలా అన్ని విభాగాలను నీ చేతిలో పెట్టుకుని వేల కోట్ల నోట్లకట్టలతో డంపు పెట్టుకున్న మీరా మాట్లాడేది అని విమర్శించారు. నకిలీ మద్యం సమాచారం అందగానే దాదులు చేసింది, అరెస్టులు చేసింది మేమే. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని సస్పెండ్ చేసింది మేమే..? ఇదీ చట్టం పట్ల ప్రజారోగ్యం పట్ల ఎమాకు ఉన్న చిత్తశుద్ధి.. మద్యం విధానంలో ఒక పారదర్శకత తేవడమే కాక ప్రజలు కోరుకున్న మద్యం తాగే స్వేచ్ఛ, డిజిటల్ చెల్లింపులు ఎక్కడైనా తప్పు జరిగితే చర్యలు తీసుకోవడం కూటమి ప్రభుత్వం విధానం. నిత్యం నేరగాళ్లకు కొమ్ముకాస్తూ ఐదేళ్ల అరాచకాలకు పాల్పడిన మీరు.. ఎన్ని జన్మలెత్తినా పాపాలను కదుక్కోలేరు.

## ఆత్మీయ అభినందన సభను జయప్రదం చేయండి

### - మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



**వరికుంటపాడు, అక్టోబర్ 7, ప్రభాతవార్త** ఈ నెల 10వ తేదీన మండలంలోని విరువూరు గ్రామంలో జరగనున్న వైసీపీ ఆత్మీయ అభినందన సభను విజయవంతం చేయాలని ఉదయగిరి నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం అభినందన సభ ఏర్పాటు పనులను ఆయన పరిశీలించారు. సభ నిర్వహణ గురించి మాజీ ఏఎంసీ చైర్మన్ షేక్ అలీ అహ్మద్, వైసీపీ మండల కన్వీనర్ మందలపు తిరుపతి నాయుడు, వైసీపీ రాష్ట్ర యువజన ఐటీ వింగ్ జాయింట్ సెక్రటరీ ముడియాల మురళీ కృష్ణారెడ్డి ఆయనకు వివరించారు. సుమారు 1500 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నట్లు వారు ఆయనకు తెలిపారు. ఈ సందర్భంగా వైసీపీ నియోజకవర్గ పరిశీలకులు మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, మండల నేతలు సమన్వయం చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామానికి సంబంధించి నూతన కమిటీ సభ్యులను పరిచయం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ లు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగా మురళీధర్‌లు పాల్గొంటారని, కాబట్టి ఉదయగిరి నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు గోను శ్రీకాంత్‌రెడ్డి, వెంకట బత్తుల రమణయ్య, ఫకీర్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నితీష్ రెడ్డి, జక్కం శ్రీనివాసులురెడ్డి, యర్రగాటి చెంచురెడ్డి, అడుసుమల్లి సిసింద్రీ, మారంరెడ్డి శివ, దేవరపు మధు, తిరుపతిరెడ్డి, జాజం వెంకటేశ్వర్లు, నారాయణ రాజు, పోలుబోయిన మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

## బుచ్చి మున్సిపల్ సిబ్బందికి గౌరవం దక్కింది




**బుచ్చి, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మున్సిఫల్ కార్మికుల కృషికి గౌరవం దక్కింది. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా మున్సిఫల్ మహిళా కార్మికురాలు నరసమ్మ స్వచ్ఛభారత్ అవార్డు అందుకున్నారు. ఈమేరకు బుచ్చి మున్సిఫల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, కమీషనర్ బాలకృష్ణా నరసమ్మను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు స్వచ్ఛత, పరిశుభ్రత పనుల్లో అత్యుత్తమ సేవలందించినందుకు అవార్డు దక్కిందన్నారు. జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. పట్టణ పరిశుభ్రత కోసం తాము నిరంతరం పనిచేస్తున్న మున్సిఫల్ సిబ్బందికి ఇలాంటి గుర్తింపు రావడం గర్వకారణం అన్నారు. మున్సిపల్ కార్మికులు ఎండవాన అనే తేడా లేకుండా కష్టపడి పనిచేస్తున్నారని చెప్పారు. పట్టణ పరిశుభ్రతకు నిత్యం చెమటోడ్చి మున్సిఫల్ కార్మికులకు ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరు ఇలాగే పనిచేసి బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీ స్వచ్ఛ మున్సిఫాల్టీగా తీర్చిదిద్దేందుకు కృషి చేయలన్నారు.

## మాజీ ఉపరాష్ట్రపతిని కలిసిన ఎమ్మెల్యే సోమిరెడ్డి



**వెంకటాచలం, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ను స్వర్ణ భారత్ ట్రెస్ట్ లో మంగళవారం సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఇద్దరు కొంతసేపు సుదీర్ఘంగా పలు రాజకీయ అంశాలు జిల్లా అభివృద్ధి గురించి చర్చించుకున్నారు.

## పాత కక్షలతో దారుణంగా వ్యక్తి పై దాడి

**విడవలూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** మండలంలోని ఊటుకూరు పంచాయతీ కంచరపాలెం గ్రామం దళిత కాలనీలో కుర్ర వెంకయ్య అనే వ్యక్తిని విడవలూరు ప్రసాద్ మొద్దికత్తితో నరికి తీవ్రంగా గాయపరిచాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి ద్విచక్ర వాహనంపై వెళుతున్న వెంకయ్యను కాపుకాసి పాత కక్షలు వలన మద్యం మత్తులో ప్రసాద్ అతి దారుణంగా గాయపరిచాడని తెలియజేశారు. బాధితుడను 108 ద్వారా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి. నరేష్ తెలిపారు.

## నైతిక విలువలు పాటిస్తే నే మనశ్శాంతి

### - రాజరాజేశ్వరనాందస్వామి




**సంగం అక్టోబర్ 7 ప్రభాతవార్త** సంగం తిరమన కొండపైన శ్రీరాజరాజేశ్వరీదేవి సమేత శ్రీ కాశీవిశ్వశ్వరస్వామి జ్ఞానపీఠం నందు లోక కళ్యాణం,విశ్వశాంతి కొరకు 45 రోజులు శ్రీ లలితా రుద్రమహాయజ్ఞం 15 వ రోజు చేరుకుంది.ఆశ్వీయుజ పౌర్ణమి సందర్భంగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, భజనలు,యజ్ఞాలు, నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాదం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పీఠాదిపతులు రాజరాజేశ్వరానంద స్వామి భక్తులకు ఆత్మబోధన చేశారు. భారతదేశం ప్రపంచముగో గొప్ప ఆధ్యాత్మిక ఆదర్శదేశమని మన పూర్వికులు గొప్ప తపస్సు సంపన్నులని సైన్స్‌కు అందని ఎన్నో రహస్యాలు వేదాలలో పొందు పరచారని చెప్పారు.నైతిక విలువలు పాటించకపోతే ధర్మ చరణ లేకపోతే భావితరాలకు ద్రోహం చేసినట్లేనని,ధ్యానం ప్రాణాయమాం వలన జ్ఞానం కలుగు తుందని స్వామి వివరించారు.

## కౌన్సిల్ సమావేశంలో 9 అజెండాలకు ఆమోదం

### ముంబాయి రహదారిలో రోడ్డు, డ్రైను, ప్లాట్‌పాంకి 8.35 కోట్లతో ప్రతిపాదనలు




**బుచ్చి అక్టోబర్ 7 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయితీ కార్యాలయంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ అధ్యక్షుతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో 9 అజెండాలకు ఆమోదం లభించింది. కమీషనర్ బాలకృష్ణా తొమ్మిది అజెండాలను చదివి వినిపించారు. వార్డు విభజనలపై కౌన్సిలర్ షేక్ షాహుల్ అభ్యంతరాలు వ్యక్తం చేయగా దీనిపైన స్పందించిన కమీషనర్ బాలకృష్ణా వార్డుల విభజన ప్రణాళిక బద్దంగానే చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం షేక్ షకిలా బేగం ముంబాయి రహదారిలో డ్రైన్లు పరిస్దితి ఏమిటని ప్రశ్నించగా స్పందించిన కమీషనర్ బాలకృష్ణ సర్వీస్‌రోడ్డుకి, ప్లాట్‌పాంకి,నూతన డ్రైన్ నిర్మాణానికి 8 కోట్లా 35 లక్షలతో కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ,ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగిందని తెలిపారు. కొద్ది రోజులలో కేంద్రం నుండి నిధులు మంజూరు అయితే ఇవ్వన్ని జరుగతాయని తెలిపారు. వ్యాపారస్తులు ప్రస్తుతం తాత్కాలికంగా మెట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పూర్తి స్దాయిలో అభివృద్ధి జరిగితే ముంబాయి రహదారిలో ట్రాఫిక్ సమస్య ఉండదని బుచ్చి టౌన్ కూడా ఎంతో అందంగా ఉంటుందని తెలిపారు. వార్డులలో అస్తవ్యస్తంగా ఉన్న ఓటర్లు 8 ఫాం ద్వారా వాళ్ళ ప్రాంతానికి దగ్గరలో ఉన్న బూత్‌కి కావాలని ధరఖాస్తు చేసుకుంటే పరిశీలించి మార్చునున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్లు,అధికారులు పాల్గొన్నారు.

## ఎస్‌జిఎఫ్ మండల స్దాయి టోర్నమెంట్ ఎంపికలు ప్రారంభించిన చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ



**బుచ్చి అక్టోబర్ 7 ప్రభాతవార్త** దొడ్ల లక్ష్మీ నర్సారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం నందు ఎస్‌జి ఎఫ్ మండలస్దాయి టోర్నమెంట్ ఎంపికలు అథ్లెటిక్స్ కబాడీ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడా అంశాలలో టోర్నమెంట్ కం సెలక్షన్ జరిగాయి. ఈకార్యక్రమానికి ముఖ్య అతి దులుగా బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ,10 వవార్డు కౌన్సిలర్ బెల్లం మల్లరెడ్డి, జిల్లా పాఠశాలల క్రీడా సమైక్య కార్యదర్శి లైను భీమతాటి వెంకటరమణయ్య, ఎం దేవిక, రత్నం ఎంఇఒ -2, తిరు పతయ్య, నాగరాజు,మల్లికార్జున,శ్రీనివాసులు, శ్రీదేవి,నాగలక్ష్మీ,రాజేష్,వ్యాయామ విద్య,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నగరంలో జంట హత్యల కలకలం




**నెల్లూరు క్రైమ్, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** నెల్లూరు నగరంలో ఇద్దరు వ్యక్తుల మృతదేహాలు పెన్నా బ్యారేజ్ సమీపంలోని జాఫర్ సాహెబ్ కాలువలో మంగళవారం ఉదయం లభించడం కలకలం రేపింది. పోలీసుల కథనంతో పాటు సేకరించిన సమాచారం మేరకు.. బ్యారేజ్ సమీపంలో ఉదయపు నడకసాగించే వారికి జాఫర్ సాహెబ్ కాలువసమీపంలో రక్తపు మరకలతో ఉన్న కర్రలు, వస్త్రాలు, చెప్పులు కనిపించాయి. అనుమానంతో కాలువలోకి చూసిన ఒక మృతదేహం నీటిలో తెలియాడుతూ కనిపించింది. వెంటనే సంత పేట పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సంతపేట సీఐ దశరథ రామారావు ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని వెలికి తీయించే ప్రయత్నం చేశారు. కాలువలోకి దిగిన ఈతగాళ్లకు మరొక శవం కూడా కనబడ డంతో రెండు మృతదేహాలను పోలీసులు వెలికి తీయించారు. మృతదేహాల తలపై కర్రలతో బలంగా కొట్టినట్లుగాయాలు, ఒంటిపైన గాయాలను పోలీసులు గుర్తించారు. ఇద్దరిని బలంగా కొట్టి మృతి చెందాక కాలువలోకి పడవేసినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. జంట హత్యల విషయం నగరంలో దావానంలా వ్యాపించింది. పోలీసు జాగిలాలను సంఘటన జరిగిన ప్రదేశానికి తీసుకువచ్చారు. పోలీస్ జాగిలాలు కాసేపు అక్కడే పచ్చడి పెన్నా నదిలో తాత్కాలికంగా గుడిసెలు వేసుకుని చాపలు పట్టుకుని జీవిస్తున్న వారి గుడిసెల వద్దకు వెళ్లాయి. సంఘటన సమాచారం అందుకున్న నెల్లూరు నగర డి.ఎస్.పి సింధుప్రియ సంఘటనా స్థలానికి చేరుకుని సంఘటన గురించి సిబ్బందిని వాకబు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్ధరాత్రి రెండు మూడు గంటల మధ్య సంఘటన జరిగినట్లు భావిస్తున్నామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని స్పష్టం చేశారు.

**- మృతుల్లో ఒకరి గుర్తింపు** హత్యకు గురైన ఇద్దరిలో ఒకరిని పోలయ్య (55) అనే వ్యక్తిగా పోలీసులు తమ దర్యాప్తులో గుర్తించారు. ఇతను పెన్నా నది ఒడ్డున చేపలు పట్టుకుని బతుకుతూ జీవించే సంచార వ్యక్తిగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఇతనితోపాటు హత్యకు గురైన వ్యక్తికి సుమారు 30 ఏళ్ల వయసు ఉంటుందని, అతని వివరాలు తెలియాల్సి ఉందని సంతపేట సీఐ దశరథ రామారావు పేర్కొన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి సంతపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**- మృతుల్లో మరొకరు గుర్తింపు..** పెన్నా నది వద్ద హత్యకు గురైన వారిలో రెండో వ్యక్తి క్యాట రింగ్ శివ(27)గా పోలీసులు గుర్తించారు. శివ అతనిస్నేహితులు మరో నలుగురు నగరంలో చిత్తు కాగితాలు ఏరుకుంటూ, మద్యం గంజాయి సేవిస్తూ విచ్చలవిడిగా జీవిస్తుంటారు. వీరిలో శివ అప్పుడప్పుడు క్యాటరింగ్ పనులకు వెళుతుంటాడు. శివకు మిగతా నలుగురికి ఇటీవల గొడవ జరిగినట్లు సమాచారం. దీంతో శివను ఎలాగైనా అంతం అందించాలని నలుగురు కలిసి, పెన్నానది సమీపంలో మారునా యుధాలతో శివపై దాడి చేసి చంపి వేసినట్లు సమాచారం. ఈ సంఘటనను అదే సమయంలో అక్కడ ఉన్న పోలయ్య అనే వ్యక్తి చూసి కేకలు వేయడంతో తమ బండారం బయ టపడుతుందని అతన్ని కూడా చంపి కాలవలో పడవేసినట్లు తెలుస్తోంది. ఈ సంఘటనపై అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆసుపత్రిలో బంగారు ఆభరణాలు చోరీ

**నెల్లూరు క్రైమ్, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళా రోగి గదిలో బంగారు ఆభరణాలు చోరీకి గురైన సంఘటన స్థానిక బాలాజీ నగర్ చేసిన పరిధిలోని విజయమహల్ రైల్వే గేట్ సమీపంలోని ఓ ఆసుపత్రిలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితురాలి కథనం మేరకు.. స్థానిక సెట్టిగుంట రోడ్డు ప్రాంతానికి చెందిన గంజాం శైలజ తన తల్లికి శస్త్ర చికిత్స జరిగి విజయమహల్ రైల్వే గేట్ సమీపంలోని ఓ ఆసుపత్రిలో ఇన్ పేషెంట్ గా ఉండడంతో ఆమెకు తోడుగా ఉన్నారు. వారం రోజులపాటు ఆసుపత్రిలో తన తల్లితో ఉండాల్సి రావడంతో తన ఇంట్లోని 12 సవర్ల బంగారు ఆభరణాలను ఒక బ్యాగులో వేసుకొని తన వద్ద ఉంచుకుని తల్లి వద్ద అదే ఆసుపత్రి గదిలో ఉంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం నిద్ర లేచేసరికి ఆభరణాల బ్యాగు కనిపించలేదు. ఆసుపత్రిలో వెతకగా మొదటి అంతస్తులో ఖాళీ బ్యాగు కనబడింది. ఆసుపత్రిలోని సీసీటీవీ ఫుటేజీ పరిశీలించగా గుర్తుతెలియని వ్యక్తి వచ్చి బ్యాగును తీసుకొని వెళుతున్నట్లు గుర్తించారు. వెంటనే బాలాజీ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై పుల్లారెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## స్వచ్ఛంద్ర అవార్డు అందుకున్న మల్లేశ్వరమ్మ




**సంగం అక్టోబర్ 7 ప్రభాతవార్త** మండల కేంద్రమైన సంగంలోని బిసి హాస్టల్ వార్డన్ ఎం.మల్లేశ్వరమ్మ రేవూరు హాస్టల్ ఇంచార్జిగా కొనసాగుతు స్వచ్చంద్ర అవార్డు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ చేతులు మీద అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు జిల్లా బిసి సంక్షేమాధికారి వెంకట లక్ష్మీ, ఆత్మకూరు సహాయ సంక్షేమాధికారి కృష్ణయ్య సూచనలతో వసతి గృహలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడం జరిగిందని దానిని పరిశీలించిన అధికారులు తనకు స్వచ్ఛంధ అవార్డు ఇవ్వడం జరిగిందని ఆమె తెలిపారు.ఈ అవార్డు అందుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. అలాగే బిసి హాస్టల్ బాలికలు సిబ్బంది మల్లేశ్వరమ్మను శాలువాలు కప్పి పూలమా లలు వేసి ఘనంగా సన్మానించారు.

## మెప్మా సిబ్బందిని సన్మానించిన చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ



**బుచ్చి అక్టోబర్ 7 ప్రభాతవార్త బుచ్చిరెడ్డిపాళెం** మున్సిపాల్టీలోని 4వ ఎస్ ఎల్ ఎఫ్‌లో ట్రెరర్స్ గార్డన్ నిర్వహణకు స్వచ్చంద్ర కార్యక్రమంలో అవా ర్డు దక్కింది. జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా అవార్డు అందుకున్న మెప్మా సిబ్బంది నాలుగోవ సమైక్య ఆర్పి షబ్నంను చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ , కమీషనర్ బాలకృష్ణా, వైస్ చైర్మన్లు యరటపల్లి శివకుమార్‌రెడ్డి, పఠాన్ నస్రీన్, కౌన్సిలర్లు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మెప్మా సిఇఒ నర్మదా మాట్లాడుతు బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని మెప్మా పరిధిలో 11 ఎస్ఎల్ ఎఫ్‌లుగాను, 125 సంఘాలు ఉన్నాయని అన్నారు. 125 సంఘాలలో 225 మంది టెర్రర్ గార్డన్స్ నిర్వహించినట్లు గుర్తించామన్నారు. వారి వివరాలను యాప్‌లోఅప్‌లోడ్ చేయడం జరిగిందన్నారు. అధికారులు క్షేత్రస్దాయిలో పరిశీలించి బుచ్చి నాలుగవ ఎస్ఎల్ఎఫ్‌లో ఏర్పాటు చేసిన టెర్రస్ గార్డన్‌కి అవార్డు దక్కిందనితెలిపారు.జిల్లా నుండి బుచ్చి మెప్మాకుఅవార్డు వరించడం గర్వంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మెప్మాద్వారా నాలుగు రకాల అవార్డులను కేటాయించారని చెప్పారు.అందులో మొదటి అవార్డు అందుకోవడం జరిగిందన్నారు.ఈ సందర్బంగా ఎంపి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీకి, కమీషనర్ బాలకృష్ణకు కౌన్సిలర్లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎల్‌హెచ్‌పిసెల్ పోస్టర్‌నుచైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మురళీ,కమీషనర్ బాలకృష్ణ చేతులమీదుగా ఆవిష్కరించారు. వ్యాపారం చేసుకోవడానికి మెప్మా ఆద్వర్యంలో బ్యాంకు ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని మెప్మాలో పొదుపు సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వేములపాటి అనంతరామయ్య జయంతి సందర్బంగా సేవా కార్యక్రమాలు

### - అన్నదాన వితరణ చేసిన ఏపి టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్




**నెల్లూరు కలెక్టరేట్,అక్టోబరు7, ప్రభాతవార్త** పేదల పక్షాన నిలిచి పోరాడిన ప్రముఖ న్యాయ వాది ,కమ్యూనిస్టు నాయకుడు దివంగత వేములపాటి అనంతరామయ్య 103వ జయంతి సందర్భంగా ఆయన కుమారులు జనసేన జిల్లా పర్యవేక్షకులు, ఏపి టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలని నిర్వహించారు. ఇందులో భాగంగా నగరంలోని స్థానిక ప్రగతి చారిటబుల్ ట్రస్ట్ నందు పిల్లల మధ్య జయంతి వేడుకలు నిర్వహించి అన్నదానం చేసారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లడుతూ పేదల ప్రక్షాన నిలబడుతూ ఉచిత న్యాయ సహాయం అందిస్తూ, ప్రపంచ శాంతికి ఏర్పాటు చేసిన కమిటీ సభ్యుని తన తండ్రి అనంతరామయ్య చేసిన సేవలని గుర్తుచేసుకున్నారు. వారు భౌతికంగా దూరమైనా వారి దీవెనలు ఎల్లపుడు తమకి తోడుగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు,నునె మల్లికార్జున యాదవ్, గుణుకుల కిషోర్ , సుందరరామిరెడ్డి, జమీర్, రవికుమార్ , కృష్ణారెడ్డి, పావుజెన్ని శేఖర్ రెడ్డి, నందిని జనసేన, మద్దతుదారులు, తదితరులు పాల్గొన్నారు.

## డిఆర్డిఏలో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 7, ప్రభాతవార్త** నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలోని డిఆర్డిఏ కార్యాల యం లో మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన ఫొటోను పూలమాలలతో సత్కరించిన ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి నాగరాజ కుమారితో పాటు డిఆర్డిఏ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి అండగా జనసేన

### - రూ.60 వేల నగదుని అందించిన టిడ్కో చైర్మన్ వేములపాటి



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 7, ప్రభాతవార్త** గత నెలలో పెరమన వద్ద ఇసుక టిప్పర్ ప్రమాదంలో దారుణంగా మృతి చెందిన ఐదు మందిలో ఆత్మ కూరు నియోజకవర్గం చెందిన జన సైనికుని కుటుం బానికి జనసేన నెల్లూరు జిల్లా నాయకులు ఆర్థి కంగా ఆసరాగా నిలిచారు. మంగళవారం జనసేన పార్టీనెల్లూరు జిల్లా కార్యాలయంలో మృతుని కు టుంబానికి అరవై వేల రూపాయల ఆర్ధిక సహాయాన్ని ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా వేములపాటి మాట్లాడుతూ జనసైనికుల మృతి పార్టీకి తీరని లోటన్నారు. జనసేన నాయకులు క్రియాశీలక సభ్యత్వం తీసుకునే విధంగా జనసేన కార్యకర్తలను ప్రోత్సహించాలని కోరారు. మృతి చెందిన వారి కుటుంబాలకు ఆర్థికంగా ఆసరాగా నిలిచే అవకాశం పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సూచించిన జనసేన క్రియాశీల సభ్యత్వాన్ని ప్రతి ఒక్కరు తీసుకోవాలన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ అన్ని రకాలుగా జనసేన పార్టీ తరఫున వారికి అండగా నిలబడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోర్ కమిటి సభ్యులు నూనె మల్లికార్జున యాదవ్, చిట్టమూరు ప్రవీణ్ రెడ్డి, సుందర్ రామిరెడ్డి, జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, కార్యాలయం ఇన్చార్జ్ జమీర్,దిశ కమిటీ మెంబర్ గజరాజు శాంతి కల, నాయకులు శివకృష్ణ, శ్రీపతి రాము, చంద్ర శేఖర్, హరీష్, మృదుల తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకి ఆర్థికసాయం అందజేత



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబరు 7, ప్రభాతవార్త** రెండురోజుల క్రితం నెల్లూ రు దేవరపాలెం గ్రామానికి చెందిన, కోటయ్య, నరసింహ, ఇద్దరు తమ పార్టీ సానుభూతిపరులు ఈతకు వెళ్లి, ప్రమాదవశాత్తు జొన్నవాడ పెన్నానదిలో పడి మృతి చెందటం విచారకరమని జనసేన పార్టీ రూరల్ ఇంచార్జ్ పావుజెన్ని చంద్ర శేఖర్ రెడ్డి పెర్కొన్నారు. సోమవారం జనసేన నేతలు బాధిత కుటుంబాలని పరామర్శించడంతో పాటు మృతుల అంత్య క్రియలలో పాల్గొని నివాళులు అర్పించారు. అలాగే ఒక్కో కుటుంబానికి తక్షణ సాయం కింద రూ .10 వేల నగదుని అందజేశారు. ఈ సందర్భగా పావుజెన్ని మాట్లడుతూ రాష్ట్ర టిడ్కో చైర్మెన్ వేములపాటి అజయ్ కుమార్ సూచనలతో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగిందన్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న జనసేన కార్యకర్తలు దురదృష్టకరంగా ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమని వారి కుటుంబాలకు తమ పార్టీ తరపున అండగా ఉంటామన్నారు. ఈ దుర్ఘటనపై పార్టీ కోర్ కమిటి సభ్యులు నూనె మల్లిఖార్జున యాదవ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుందర రామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యాదర్శి గునుకుల కిషోర్, కాకు మురళీరెడ్డి, శ్రీపతి రాము, తదితరులు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యాలయ ఇంచార్జ్ జమీర్, నాయకులు రమేష్, పెనేటి శ్రీకాంత్, ప్రశాంత్ గౌడ్, దేవా, బోస్ తదితరులు పాల్గొన్నారు.